


రైతు బజారులో నిమ్మ కాయలను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

బంగినపల్లి మామిడి భళా


మామిడి పండ్ల వ్యాపారితో మాట్లాడుతున్న సీఎం

ఏమ్మా.. సొరకాయ ఎంత?


మహిళా వ్యాపారితో మాట్లాడుతున్న చంద్రబాబు

కరివేపాకు ధర పర్లేదా..!


కరివేపాకును పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి

ఎన్ని ఎకరాల్లో ఉల్లి సాగు..


కూరగాయల వ్యాపారితో..

ఆకుకూరలు కొంటున్నారా?


ఆకుకూరల వ్యాపారితో మాట్లాడుతూ..

గోరుకల్లు నుంచి తాగునీరు


అయ్యమ్మతో.. ఆప్యాయంగా..

పారిశుధ్య కార్మికురాలు అయ్యమ్మతో నడుస్తూ ఆమె కష్టాలను తెలుసుకుంటున్న సీఎం చంద్రబాబు నాయుడు

- పాణ్యం నియోజకర్గంలో రోడ్లకు రూ.50 కోట్లు
- సీ-క్యాంప్ రైతు బజారు అభివృద్ధికి రూ.6 కోట్లు మంజూరు
- ఓర్వకల్లు కేంద్రంగా పలు పరిశ్రమలు స్థాపన
- కర్నూలు నుంచి ఓర్వకల్లుకు రైల్వేలైన్, నీటి వసతి
- సీఎం చంద్రబాబు హామీ
- డాక్టర్ అంబేడ్కర్, అబ్దుల్ కలాంలు పేద కుటుంబంలో జన్మించినవారే
- నేను 8 కిలోమీటర్లు నడిచి చదువుకున్నాను
- జైరాజ్ ఇస్పాత్ కంపెనీ నిర్మించే స్వచ్ఛాంధ్ర పార్కుకు శంకుస్థాపన చేసిన చంద్రబాబు

కర్నూలు, మే 17 (ఆంధ్రజ్యోతి): 'కర్నూలు, కల్లూరు అర్బన్ వార్డుల్లో గోరుకల్లు జలాశయం నుంచి తాగునీటి అందిస్తాం. ఈ బృహత్తర కార్యక్రమానికి త్వరలోనే శ్రీకారం చుడుతాం. రహదారుల నిర్మాణాల కోసం రూ.50 కోట్లు కేటాయిస్తున్నా..' అని చంద్రబాబు కర్నూలు, కల్లూరు అర్బన్ వార్డులపై వరాలజల్లు కురిపించారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, ఎంపీ బైరెడ్డి శబరి విజ్ఞప్తి మేరకు పాణ్యం నియోజకవర్గంలోకి వచ్చే వార్డులకు తాగునీటి సమస్యలను పరిష్కరిస్తానని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా సీఎం చంద్రబాబు శనివారం కర్నూలు జిల్లా పాణ్యం, కర్నూలు నియోజకవరాల పరిధిలోని పలు అర్బన్ వార్డుల్లో పర్యటించారు. ఓర్వకల్లు విమానాశ్రయం నుంచి చంద్రబాబు రోడ్డు మార్గంలో గుత్తిరోడ్ మీదుగా సీ.క్యాంప్ రైతు బజారుకు చేరుకున్నారు. అక్కడ రైతులతో మాట్లాడారు. కూరగాయాలు కొనుగోలు చేశారు. కూరగాయాల వ్యర్థాలను ఎరువులుగా తయారు చేసే ప్రక్రియను చంద్రబాబు పరిశీలించారు. పారిశుధ్య కార్మికులతో కలసి రైతు బజారులో పరిశీలించారు. ఎలాంటి సెక్యూరిటీ, రాష్ట్ర, జిల్లా అధికారులు దగ్గరకు రానివ్వకుండా చంద్రబాబు, ఇద్దరు పారిశుధ్య కార్మికులు అయ్యమ్మ, వెంకటేష్‌లతో మాత్రమే వెళ్లి రైతు బజారులో కలియతిరిగారు. అక్కడి నుంచి కేంద్రీయ విద్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ప్రజావేదికకు చంద్రబాబు చేరుకున్నారు. వివిధ స్టాల్స్‌ను పరిశీలించారు. పీ-4 విధానంలో భాగంగా అమలు చేస్తున్న మార్గదర్శి-బంగారు కుటుంబాలతో మాట్లాడారు.

మిగతా 6వ పేజీలో


పారిశుధ్య కార్మికులతో..

మొక్కను నాటి..

సి.క్యాంపు రైతు బజార్ వద్ద..

డ్రోన్ పరికరాన్ని పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు


మహిళా రైతుకు నమస్కరిస్తూ..


మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్మికులు, ప్రజలతో స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు

పాక్‌కు గుణపాఠం చెప్పిన భారత్

- సైనికులకు అండగా నిలిచిన రాష్ట్ర ప్రభుత్వం
- రాష్ట్ర ఆర్అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి


తిరంగా ర్యాలీలో పాల్గొన్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి


మంత్రి బీసీ ప్రసంగం

కొలిమిగుండ్ల, మే 17 (ఆంధ్రజ్యోతి): మనదేశంపై ఉగ్రమూకలను ఉసిగొల్పిన పాకిస్థాన్‌కు భారత ప్రభుత్వం గట్టి గుణపాఠం చెప్పిందని రాష్ట్ర ఆర్అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. 'ఆపరేషన్ సిందూర్' విజయవంతమైన నేపథ్యంలో భారత సైనికులకు సంఘీభావంగా శనివారం కొలిమిగుండ్లలో నిర్వహించిన తిరంగా ర్యాలీలో మంత్రి పాల్గొన్నారు. మొదట హైస్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ర్యాలీని ప్రారంభించారు. జడ్పీహెచ్ఎస్ నుంచి పోలీస్‌స్టేషన్, బ్యాంకు మీదుగా, ఆర్టీసీ బస్టాండు వరకు ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం జరిగిన సభలో మంత్రి బీసీ మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో భారత్ అత్యంత శక్తివంతమైన దేశంగా ఎదిగిందన్నారు. ఇండియా జోలికొస్తే ఏం జరుగుతుందో పాకిస్థాన్‌కు మన సైనికులు రుచి చూపించారని అన్నారు. 'ఆపరేషన్ సిందూర్'లో మురళీనాయక్ వీరమరణం పొందడం బాధాకమని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మూలే రామేశ్వరరెడ్డి, వీఆర్ లక్ష్మీరెడ్డి, నంద్యాల రామేశ్వరరెడ్డి, అంబటి జయలక్ష్మీరెడ్డి, గొంగటి హుస్సేన్‌రెడ్డి, ప్రసాదు, నరసింహుడు, కామిని క్రిష్ణరంగారెడ్డి, కత్తి రాందాస్, శివరామిరెడ్డి పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- మొక్కల పెంపకంతో కాలుష్య నివారణ
- న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్

నంద్యాల టౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి): మన పరిసరాలను మనమే పరిశుభ్రంగా ఉంచుకోవాలని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖా మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఆత్మకూరు బస్టాండులోని ఫిల్టర్ పంపుహౌస్ ఏర్పాటుచేసి 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర' స్వచ్ఛఆంధ్ర అనే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు పెంపకంతో కాలుష్యాన్ని నివారించొచ్చు అని అన్నారు. ప్రస్తుతం ఎండలు ఎక్కువగా ఉన్నా యని, వాటి నుంచి ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం ప్రతినెల మూడో శనివారం ఈకార్యక్రమం నిర్వహించడంతో ప్రజల్లో పరిశుభ్రతపై మరింత అవగాహన పెరుగుతుందన్నారు. ఇప్పటికే సీఎం చంద్రబాబు నాయుడు ప్రజల ఆరోగ్యంపై చాలా జాగ్రత్తలు తీసుకుని వారికి కావా ల్సిన అందించడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. దీంతో నంద్యాలల్లో ఎక్కడ కూడా మురుగు నిల్వలు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పురపాలక అధికారులకు సూచిం చారు. అనంతరం ఆయా ప్రాంతంలో మొక్కలు నాటి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్ర మంలో నంద్యాల మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాస్, ఎంఈ గురప్ప యాదవ్, కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.


మొక్క నాటి ప్రతిజ్ఞ చేస్తున్న మంత్రి ఫరూక్, అధికారులు

పీహెచ్‌సీలకు వైద్యుల నియామకం

నంద్యాల హాస్పిటల్, మే 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పీహెచ్‌సీలకు నూతనంగా 10మంది వైద్యులను నియమించి నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ శనివారం తెలిపారు. బేతంచెర్ల పీహెచ్‌సీకి బి.సాయిశ్రీ, శిరివెళ్లకు ఎం.ఆంజనేయులు నాయక్, డబ్ల్యూ కొత్తపల్లెకు బి.స్రవంతి, ఆలమూరుకు బి.నాగ శ్రీజ, దొర్నిపాడుకు కె.వెంకటశివను నియమించినట్లు తెలిపారు. అలాగే జలదుర్గం పీహెచ్‌సీకి వై.హరిత, బ్రాహ్మణకొట్కూరుకు ఎన్.దివ్య, ప్యాపిలికి గుణరాహుల్, పగిడ్యాలకు బి.హర్ష, మద్దూరుకు వైకే నీరజాక్షిని నియమించినట్లు తెలిపారు. పీహెచ్‌సీల్లో నియామకమైన వైద్యులందరూ విధులకు హాజరైనట్లు ఆయన చెప్పారు.

డీసీహెచ్‌ఎస్‌గా డాక్టర్ లలిత



నంద్యాల హాస్పిటల్, మే 17 (ఆంధ్రజ్యోతి): నంద్యాల డీసీహెచ్ఎస్‌గా ప్రభుత్వం డాక్టర్ ఓ.లలితను నియమించింది. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన బదిలీల్లో భాగంగా సీనియార్టీ దృష్ట్యా బనగానపల్లెలో పనిచేస్తున్న ఆమెను డీసీహెచ్ఎస్‌గా నియమించింది. ప్రస్తుతం పనిచేస్తున్న డీసీహెచ్ డాక్టర్ జఫ్రుల్లాను ఆళ్లగడ్డకు బదిలీ చేసింది. డాక్టర్ జఫ్రుల్లా గత మూడేళ్లుగా నంద్యాల జిల్లాలో డీసీహెచ్ఎస్‌గా పనిచేశారు. కొత్తగా నియమితులైన లలిత సోమవారం బాధ్యతలు తీసుకోనున్నారు.

పరిశుభ్రతలో భాగస్వామ్యం కావాలి

- కలెక్టర్ రాజకుమారి


పాణ్యం మార్కెట్ యార్డులో చెత్తను సేకరిస్తున్న కలెక్టర్ రాజకుమారి

పాణ్యం, మే 17 (ఆంధ్రజ్యోతి): పరిశుభ్రతలో ప్రజలు భాగస్వామ్యం కావాలని కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర'లో భాగంగా శనివారం పాణ్యంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వ్యవసాయ మార్కెట్లో మండల మహిళా సభ్యులతో కలిసి చెత్తాచెదారం తొలగించారు. ఆర్టీసీ బస్టాండు వద్ద ఏర్పాటు చేసిన పారిశుధ్య కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మొక్కలను పెంచడమే గాక వాటి సంరక్షణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. జిల్లాలో మొట్టమొదట హెవీ లైసెన్స్ పొందిన లక్ష్మీదేవిని కలెక్టర్ అభినందించారు. అనంతరం చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం గంగాధర్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, తహసీల్దారు నరేంద్రనాథ్‌రెడ్డి, ఎంపీపీ ఉశేన్‌బీ, డిప్యూటీ ఎంపీడీవో చంద్ర మౌళీశ్వరగౌడ్, ఆర్ఎం రజియాసుల్తానా, పంచాయతీ కార్యదర్శి ఆనంద రావు, పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడు వేధిస్తున్నాడని కలెక్టర్‌కు ఫిర్యాదు

మండలంలోని సుగాలిమెట్ట గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు తిరిపాలు నాయక్ నిత్యం తనను వేధిస్తున్నాడని సచివాలయ ఏఎన్ఎం ఫరీదా కలెక్టరుకు కన్నీటితో మొరపెట్టుకున్నారు. ఇంటి వద్దకు వచ్చి ఆరోగ్య పరీక్షలు చేయాలని, ఫోన్‌లో వేధిస్తున్నాడని కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. కలెక్టరు స్పందించి తిరిపాలునాయక్‌ను విచారించి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

మాటల్లో చెప్పలేని సంతోషం

- నాటి నిర్ణయం నేడు వేలాది మందికి ప్రయోజనం
- సీ.క్యాంపు రైతుబజార్ పర్యటనలో ఆనందం వ్యక్తం చేసిన సీఎం చంద్రబాబు
- 45 నిమిషాల పాటు రైతులతో ముఖాముఖి



రైతుబజార్‌లో సీఎం చంద్రబాబు, మంత్రి టీజీ భరత్

కర్నూలు అగ్రికల్చర్/న్యూసిటీ, మే 17(ఆంధ్రజ్యోతి): 'ఈ సంతోషం మాటల్లో చెప్పలేకపోతున్నా.. మొదటిసారిగా 1999లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పుడే రైతుల సంక్షేమం, మహిళలు, అన్నివర్గాల ప్రజల కోసం పనిచేయాలని నిర్ణయించుకున్నాను. ఆ ఆలోచన నుంచి పుట్టిందే రైతుబజార్ల వ్యవస్థ. రైతులు పొలాల్లో పడుతున్న కష్టానికి లాభం పొందడంతో పాటు అదే రీతిలో ప్రజలకు నాణ్యమైన కూరగాయలు తాజావి అందించాలనే ధ్యేయంతో రైతుబజార్ల ఏర్పాటుకు కృషి చేశాను' అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా కర్నూలులోని సి.క్యాంపు రైతు బజార్‌లో పర్యటించి రైతులు, పొదుపులక్ష్మి మహిళలతో మాట్లాడినప్పుడు వారి కళ్లలో కనిపించిన ఆనందం చూసి ఎంతో సంతోషించానని సీఎం అన్నారు. దాదాపు 45 నిమిషాలు సి.క్యాంపు రైతుబజార్‌లో సీఎం చంద్రబాబు ఎంతో ఉల్లాసంగా...ఉత్సాహంగా రైతుల కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు.

యువరైతుకు ముఖ్యమంత్రి అభినందన

సూర్యప్రకాష్‌రెడ్డి ఎంఎస్సీ (బోటని) చదివారు. కర్నూలు జిల్లా క్రిష్ణగిరి మండలం తాపలకొత్తూరులో తనకున్న 20 ఎకరాల పొలంలో వివిధ రకాల పంటలు ప్రకృతి సేద్యంతో పండిస్తున్నారు. అక్కడి ఆహార ఉత్పత్తులను సి.క్యాంపు రైతుబజార్‌లో విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. వ్యవసాయం చేయకముందు కొన్ని నెలలు హైదరాబాద్‌లో ఉద్యోగం చేశానని, అయితే సంతృప్తి లేకపోవడంతో ఉన్న పొలంలోనే పంటలు సాగు చేస్తూ లాభం పొందుతుండటమే కాక పదిమందికి ఆరోగ్యాన్ని ఇచ్చే ఆహార ఉత్పత్తులను విక్రయిస్తున్నందుకు సంతోషంగా ఉందంటూ సూర్యప్రకాష్‌రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబుతో తన అనుభవాలను పంచుకున్నారు. మీలాగే చదువుకున్న వారంతా ఉద్యోగాలపై ఆధారపడకుండా కష్టపడితే మంచి ఫలితం ఉంటుందని నిరూపించావంటూ సీఎం చంద్రబాబు ఆ యువరైతును అభినందించారు. యువరైతుతో కలిసి సీఎం, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు గ్రూప్ ఫొటో దిగారు.

సీఎం పర్యటన సాగిందిలా...

స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం కర్నూలు నగరంలోని సి.క్యాంపు రైతు బజార్‌లో పర్యటించారు.

- మధ్యాహ్నం 1.30 గంటలకు సి.క్యాంపు రైతు బజారుకు వచ్చారు.
- 45 నిమిషాలపాటు రైతులతో ముఖాముఖి..అధికారులకు వివిధ అభివృద్ధి పనులపై ఆదేశాలు
- కూరగాయల నిల్వ కోసం రైతు శ్రీరాములు ఏర్పాటు చేసుకున్న ఫ్రీజర్ పరిశీలన
- చెత్తశుద్ధి యంత్రాన్ని ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- పారిశుధ్య కార్మికులకు సన్మానం
- 2.13 నిమిషాలకు రైతుబజార్‌లో పర్యటన ముగించుకుని అక్కడే రోడ్డుపై వేచిచూస్తున్న ప్రజలకు అభివాదం తెలుపుతూ సభా వేదికకు బయలుదేరారు.

సెట్కూర్ శాఖ ఆధ్వర్యంలో వినతుల స్వీకరణ

సీఎం చంద్రబాబును కలిసేందుకు వచ్చిన ప్రజల సమస్యలను వినతుల రూపంలో స్వీకరించేందుకు సెట్కూర్ శాఖను కలెక్టర్ నియమించారు. ఈ మేరకు సి.క్యాంపు రైతుబజార్ వద్ద సెట్కూర్ సీఈఓ వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది ప్రజల నుంచి వివిధ రకాల సమస్యలపై వినతులను స్వీకరించారు.

మా కుటుంబం మీకు రుణపడి ఉంటుంది



కుటుంబ సభ్యులను పోషించుకునే దారి తెలియక కొన్ని సంవత్సరాలు చాలా ఇబ్బందులు పడ్డానని, తమ కుటుంబం మీకు రుణపడి ఉంటుందని పొదుపు మహిళ పార్వతమ్మ సీఎం చంద్రబాబుతో అన్నారు. ఈ రైతుబజార్‌లో పొదుపు లక్ష్మీ గ్రూపు మహిళగా కూరగాయల వ్యాపారం చేసేందుకు అవకాశం దక్కిందని సంతోషం వ్యక్తం చేశారు. దీంతో కుటుంబ పోషణ ఎంతో సాఫీగా సాగుతోందన్నారు. సీఎం మాట్లాడుతూ మీలాగే ధైర్యం తెచ్చుకుని మహిళలంతా ఏదో ఒక ఉపాధి పొందాలని మీకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తుందని చంద్రబాబు పొదుపు లక్ష్మి గ్రూపు మహిళలకు హామీ ఇచ్చారు.

- పార్వతమ్మ, పొదుపు మహిళ

పండ్ల వ్యాపారంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నా



పండ్ల వ్యాపారంతో చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నానని నగరంలోని శరీన్‌నగర్‌కు చెందిన పొదుపు మహిళ సుజాత అన్నారు. తన భర్త రామదాసు దివ్యాంగుడు కావడం వల్ల ఈ రైతు బజార్‌లో పండ్లను విక్రయిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నానని సీఎం చంద్రబాబుతో చెప్పారు. సీఎం మాట్లాడుతూ పొదుపు లక్ష్మీ గ్రూప్ ఉద్యమాన్ని తానే అకురార్పణ చేశానని ఈ రోజు మా ప్రభుత్వానికి కొండంత అండగా మీరు ఉన్నారని సీఎం తెలిపారు. - సుజాత, పొదుపు మహిళ

పూల వ్యాపారంతో ఉపాధి



సి.క్యాంపు రైతు బజార్‌లో పూల వ్యాపారం చేస్తూ ఉపాధి పొందుతున్నానని చిన్నటేకూరుకు చెందిన గాయత్రి తెలిపారు. తన భర్త అనారోగ్యంతో మూడేళ్ల క్రితం చనిపోయారని, అప్పటి నుంచి కుటుంబ పోషణకు తనకున్న 40 సెంట్ల పొలంతో పాటు మరో రెండు ఎకరాలను గుత్తకు తీసుకుని వివిధ రకాల పూలు పండిస్తూ విక్రయిస్తున్నానని చెప్పారు. పింఛన్ కోసం మూడేళ్ల నుంచి అధికారుల చుట్టూ తిరుగుతున్నాని, ఎవ్వరు పట్టించుకోలేదని ముఖ్యమంత్రికి తన గోడును మొరపెట్టుకున్నారు. దీంతో ఉన్నతాదికారుల నిర్లక్ష్యంపై సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే పింఛన్ మంజూరు చేయాలని ఆదేశించారు.

-గాయత్రి

మామిడి సాగుతో ఏటా రూ.లక్షన్నర ఆదాయం




సేంద్రియ ఎరువులతో మామిడి పంటను సాగుచేసి రైతు బజార్‌లో వాటిని అమ్ముకుంటూ ఏటా రూ.లక్షన్నర ఆదాయం పొందుతున్నట్లు రైతు నాగేశ్వరరావు తెలిపారు. రైతు బజార్ వల్ల ఉపాధి పొందుతున్నామని చెప్పారు. ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహమందిస్తున్నామని సీఎం చంద్రబాబు చెప్పారు.

- నాయకల్లు నాగేశ్వరరావు

గోరుకల్లు నుంచి తాగునీరు

(5వ పేజీ తరువాయి)





జిల్లా పర్యటన కోసం అమరావతి నుంచి ఓర్వకల్లు విమానాశ్రయానికి 12.30 గంటలకు చంద్రబాబు చేరుకున్నారు. మంత్రులు నారాయణ, ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డి, టీజీ భరత్, ఎంపీలు బస్తిపాటి నాగరాజు, బైరెడ్డి శబరి, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, ఎమ్మెల్యేలు గౌరు చరిత, బొగ్గుల దస్తగిరి, గిత్తా జయసూర్య, పార్థసారథి, కేఈ శ్యాంబాబు, సీనియర్ నాయకులు గౌరు వెంకటరెడ్డి, ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి, కర్నూలు, నంద్యాల జిల్లాల టీడీపీ అధ్యక్షులు తిక్కారెడ్డి, మల్లెల రాజశేఖర్, మాజీ మంత్రులు ఏరాసు ప్రతాప్‌రెడ్డి, కేఈ ప్రభాకర్, కలెక్టరు పి.రంజిత్‌బాషా, ఎస్పీ విక్రాంత్ పాటిల్ తదితరులు ఘన స్వాగతం పలికారు. రైతు బజార్ నుంచి సీఎం చంద్రబాబు నేరుగా నంద్యాల చెక్‌పోస్టు వద్ద ఏర్పాటు చేసిన ప్రజా వేదిక సభలో మాట్లాడారు. కల్లూరు అర్బన్ 16 వార్డుల ప్రజలకు గోరుకల్లు రిజర్వాయర్ నుంచి ప్రత్యేక పైపులైన్ ద్వారా నీటిని మళ్లించి శుద్ధిచేసి అందిస్తామని హామీ ఇచ్చారు. ఓర్వకల్లును డ్రోన్ హబ్‌గా మారుస్తామని అన్నారు. ఇండస్ట్రియల్ నోడ్ కింద రూ.2,860 కోట్లతో మౌలిక వసతులు కల్పిస్తామని, రైల్వేలైన్, నీటి వసతి ఏర్పాటు చేస్తామని చంద్రబాబు వివరించారు.





దేశానికే తలమానికం గ్రీన్ ఎనర్జీ

ఓర్వకల్లును డ్రోన్ హబ్‌గా అభివృద్ధి చేస్తున్నాం. ఇక్కడ గ్రీన్‌కో సోలార్ పవర్ యూనిట్, పంప్డ్ స్టోరేజ్ యూనిట్, జైరాజ్ ఇస్పాత్ పరిశ్రమ, డీఆర్‌డీవో వచ్చాయి. మరి న్ని పరిశ్రమలు రాబోతున్నాయని సీఎం చంద్రబాబు అన్నారు. రాయలసీమలో ఉత్పత్తి చేసే గ్రీన్ ఎనర్జీ దేశానికే తలమానికంగా నిలిచింది. ఉమ్మడి కర్నూలు ప్రజలు నన్ను గౌరవించారు. వారి రుణం తీర్చుకుంటానన్నారు.

ఓర్వకల్లు పాలకోవా బ్రహ్మాండం

'ఒకనాడు పేదరికంలో ఎన్నో కష్టాలు పడ్డారు. నేను తీసుకొచ్చిన పొదుపు ఉద్యమం ద్వారా ఆర్థికంగా బలోపేతమయ్యారు. ఐదు బంగారు కుటుంబాలకు మార్గదర్శకులై ఓర్వకల్లు పొదుపు మహిళలు ఆదర్శంగా నిలిచారు. ఓర్వకల్లు పాలకోవా బ్రహ్మాండంగా ఉంటుంది. డ్వాక్రా, మెప్మా ద్వారా మరింత ప్రోత్సాహం అందిస్తాం. డ్వాక్రా సంఘాలంటే రాజకీయ నాయకులకు భయం. గ్రామాల్లో వారికి మంచి గౌరవం ఉంటుంది. ఇక్కడ ఉన్న ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యే గౌరు చరిత ఇద్దరూ మహిళలు. వారిని చట్టసభలకు పంపిన ఘనత టీడీపీదే' అని చంద్రబాబు అన్నారు.



చిరుధాన్యాల స్టాల్‌ను పరిశీలిస్తున్న చంద్రబాబు



స్వచ్ఛాంధ్ర ప్రతినిధులతో సీఎం చంద్రబాబు

కాటసాని కబ్జాలపై విచారణ కమిటీ వేయాలి

వైసీపీ హయంలో పాణ్యం నియోజకవర్గంలో కబ్జాలు విచ్చలవిడిగా జరిగాయి. పది మంది టీడీపీ కార్యకర్తల్లో ఒకరి ఆస్తులు కబ్జాకు గురయ్యాయి. మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి భూకబ్జాలపై విచారణ కమిటీ వేయాలి. ఒక మహిళలను ఎంపీ చేయడమే కాకుండా జాతీయ, అంతర్జాతీయ కమిటీల్లో సభ్యురాలిగా చేర్చి గుర్తింపు ఇచ్చారు. రాయలసీమ సస్యశామలం చేయడానికి సీఎం చంద్రబాబు రేయింబవళ్లు కృషి చేస్తున్నారు.

- బైరెడ్డి శబరి, నంద్యాల ఎంపీ

ధనలక్ష్మినగర్ పార్కును సుందరీకరించండి

సీఎం చంద్రబాబు నాయుడు



పార్కు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న సీఎం చంద్రబాబు

కర్నూలు క్రైం, మే 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక ధనలక్ష్మినగర్‌లో ఉన్న పార్కును 'స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర'లో భాగంగా సుందరీకరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. శనివారం పార్కు అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. ఈ పార్కును జైరాజ్ ఇస్పాత్ లిమిటెడ్ సంస్థ సీఎస్ఆర్ నిధుల్లో భాగంగా రూ.50 లక్షల నిధులతో అభివృద్ధి చేసేందుకు సీఎం చంద్రబాబు మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి పైలాన్ ఆవిష్కరించారు. పార్కును అభివృద్ధి చేసేందుకు పురపాలక మంత్రి నారాయణ సూచనలు తీసుకోవాలని జైరాజ్ కంపెనీ యజమానిని ఆదేశించారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర సుందరీకరణ వివరాలను ఏపీ గ్రీన్ అండ్ బ్యూటీఫికేషన్ కార్పొరేషన్ ఎండీ శ్రీనివాసులు సీఎంకి వివరించారు. అనంతరం ముఖ్యమంత్రి పార్కులో చెట్లు నాటారు.

పాణ్యంను ఆదర్శంగా తీర్చుదిద్దుతా

సీఎం చంద్రబాబు స్ఫూర్తి, సహకారంతో పాణ్యం నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చుదిద్దుతా. ఓర్వకల్లుకు రూ.2,860 కోట్లు కేంద్ర బడ్జెట్‌లో కేటాయించారు. హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు మంత్రివర్గం, అసెంబ్లీలో ఆమోదం తెలిపారు. ఆ దిశగా చర్యలు తీసుకుంటున్న సీఎంకు ధన్యవాదాలు. కల్లూరు అర్బన్ 16 వార్డుల్లో తాగునీటి సమస్య తీర్చేందుకు గోరుకల్లు నుంచి పైపులైన్ వేయాలి. గోరుకల్లు, అలగనూరు రిజర్వాయర్లు మరమ్మతులు చేయాలి. విస్తరిస్తున్న కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు వేయాలి. సఫా కాలేజీ నుంచి నంద్యాల చెక్ పోస్టు వరకు నాలుగు రోడ్ల రహదారి నిర్మించాలి. ఉర్దూ విశ్వవిద్యాలయం భవనాలు పూర్తి చేయాలి.

- గౌరు చరితారెడ్డి, ఎమ్మెల్యే

సీ.క్యాంప్ రైతు బజారు అభివృద్ధికి రూ.6 కోట్లు

'మంత్రి టీజీ భరత్ విజ్ఞప్తి మేరకు సి.క్యాంప్ రైతు బజారు అభివృద్ధికి రూ.6 కోట్లు మంజూరు చేస్తున్నాను. అండర్‌గ్రౌండ్‌లో పార్కింగ్ సౌకర్యం కల్పిస్తా. రాష్ట్రంలోనే ఉత్తమ రైతు బజారుగా తీర్చిదిద్దుతా..' అని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రైతు బజారులో పర్యటిస్తూ పండ్లు, పూలు, కూరగాయలు అమ్మే రైతులతో మాట్లాడారు. ఎన్ని ఎకరాల్లో పంటలు వేశారు.. రోజుకు ఎంత వ్యాపారం జరుగుతుంది.. ఏడాది ఆదాయం ఎంత వస్తుంది వంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయం ఉత్పత్తుల కేంద్రాన్ని పరిశీలించి ప్రతి రైతు బజారులో ఇలాంటివి ఏర్పాటు చేయాలని కలెక్టరుకు చెప్పారు.

సీఎం దిశా నిర్దేశంతో జిల్లా ప్రగతి

సీఎం చంద్రబాబు దిశా నిర్దేశంతో జిల్లాను ప్రగతి పథంలో నడిపిస్తున్నాం. జిల్లాలో ప్రతి మూడవ శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర పక్కాగా అమలు చేస్తున్నాం. 4 లక్షల మందికిపైగా ప్రజలు, ఉద్యోగులు పాల్గొంటారు. పీ-4 కార్యక్రమంలో జిల్లాలో అమలు చేస్తున్నాం. జిల్లాలో 20 శాతం మంది ఆర్థికంగా వెనుకబడిన వారిని గుర్తించాం. 55 మంది మార్గదర్శకులను కూడా ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేశాం. ముఖ్యమంత్రి విజన్ మేరకు ఈ పది నెలల్లో జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాం. ఓర్వకల్లు హబ్‌లో 5 వేల ఎకరాల్లో ఇండస్ట్రియల్ నోడ్ వస్తుంది. వీటి ద్వారా 6 వేల మందికి ఉద్యోగాలు వస్తాయి.

- పి.రంజిత్ బాషా, కలెక్టర్

శాశ్వత అధికారమే లక్ష్యం..

- ప్రతి కార్యకర్త పనిచేయాలి
- అందరికీ న్యాయం చేస్తా
- ప్రజల్లో ఉంటూ పార్టీని పటిష్ట పరచాలి
- 'నీరు-చెట్టు' బాధ్యత కార్యకర్తలదే
- ప్రధాని మోదీలా ఐదుసార్లు అధికారంలో ఉండాలి
- కాటసాని కబ్జాలపై కమిటీ వేసి న్యాయం చేస్తాం
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు

కర్నూలు అర్బన్, మే 17(ఆంధ్రజ్యోతి): శాశ్వత అధికారమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని సీఎం చంద్రబాబు నాయుడు కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. శనివారం సాయంత్రం నగర శివారులో పాణ్యం నియోజకవర్గ టీడీపీ కార్యాకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీలా ఐదు సార్లు అధికారంలో ఉండేలా పనిచేయాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. ఎంపీ, ఎమ్మెల్యేలతో సంబంధం లేకుండా నిత్యం ప్రజల్లో ఉంటూ పార్టీని పటిష్ఠ పరిచాలని అన్నారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా ప్రశాంత జీవనం గడిపేలా పీ-4 కార్యక్రమాన్ని చేపట్టానని, ప్రజలతో పాటు ప్రతి కార్యకర్త ఆర్థికంగా బలపడాలని సూచించారు. ప్రతి నాయకుడి, కార్యకర్తకు సంబంధించిన పూర్తి సమాచారం తన దగ్గర ఉందని తెలిపారు. 'నీరు-చెట్టు' పనులన్నీ కార్యకర్తల ద్వారానే పూర్తిచేసేందుకు ఆదేశించామన్నారు. పాణ్యం నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి చేసిన కబ్జాలపై కమిటీ వేసి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. రాబోయే రోజుల్లో ప్రతి కార్యకర్త పార్టీకి కష్టపడాలని, అందరికీ న్యాయం చేస్తానని, నిరుత్సాహ పడవద్దని భరోసా ఇచ్చారు. దాదాపు 650మంది కార్యకర్తలు హాజరుకాగా అందులో ఐదు మంది బెస్ట్ కార్యకర్తల కింద ఎంపిక చేసి వారితో చంద్రబాబు మాట్లాడారు. కల్లూరు మండలానికి చెందిన ఓకార్యకర్త తనకు ఉండేందుకు ఇల్లు లేదని ఏళ్లుగా పార్టీకి అంకితమై పని చేస్తున్నానని తెలిపారు. స్పందించిన చంద్రబాబు మాట్లాడుతూ తనసొంత నిధులు రూ.3లక్షలతో ఇంటి నిర్మాణానికి అందజేస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో మంత్రులు బీసీ జనార్ధన్‌రెడ్డి, ఫరూక్, ఎంపి బైరెడ్డి శబరీ, ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, నంద్యాల జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖరగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు నాయుడు



హాజరైన పాణ్యం టీడీపీ శ్రేణులు

రైతులతో ముచ్చట

- కూరగాయల ధరలు, లాభాల గురించి తెలుసుకున్న సీఎం చంద్రబాబు నాయుడు
- అందరి వద్దకు వచ్చి పలకరించడంతో ఆశ్చర్యపోయిన అన్నదాతలు

కర్నూలు న్యూసిటీ, మే 17(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సి.క్యాంపు రైతు బజార్‌లో ఒక సామాన్యుడిగా తిరిగారు. ఎలాంటి మంది మార్బలం.. అధికారులు ఎవరూ లేకుండా కేవలం ఇద్దరు పారిశుధ్య కార్మికులతో కలిసి రైతు బజార్ మొత్తం చుట్టేశారు. అక్కడ రైతులతో వ్యక్తిగతంగా మాట్లాడటంతో పాటు వారి బాగోగులు.. కూరగాయలు, పండ్లు, పూల వ్యాపారాల నుంచి వస్తున్న లాభనష్టాల గురించి ఆసక్తికరంగా అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరి వద్దకు సీఎం ఒక్కరే వచ్చి పలకరిస్తుండటంతో రైతులు, వ్యాపారులంతా అవాక్కయ్యారు. తమ వద్దకు వచ్చి మాట్లాడుతున్నది సీఎం చంద్రబాబేనా? అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ప్రతి మనిషిని పలకరించారు. అంతే కాకుండా కూరగాయలు, పండ్లు కూడా కొనుగోలు చేశారు. ఈ క్రమంలో ప్రతి ఒక్కరి ముఖంలో చిరునవ్వు కనిపించింది. అంతే కాకుండా రైతు బజార్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన చెత్తశుద్ధి యంత్రాన్ని పారిశుధ్య కార్మికులతో కలిసి సీఎం స్వయంగా పరిశీలించారు. అది ఎలా పని చేస్తుంది.. దాని వల్ల లాభాలు ఏమిటని కార్మికులని ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు.



సబ్జికూలర్ గురించి రైతును వివరాలు అడిగి తెలుసుకుంటున్న సీఎం

సబ్జికూలర్ గురించి తెలుసుకున్న ముఖ్యమంత్రి

రైతుబజార్‌లో సీఎం చంద్రబాబు పర్యటనలో సబ్జికూలర్ ప్రత్యేకంగా నిలిచింది. ఎన్నడూ లేని విధంగా అది కొత్తగా కనిపించడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు దానిని ఏర్పాటు చేసిన రైతు శ్రీరాములను దాని గురించి సుమారు పదినిమిషాలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇందులో కేవలం సబ్జి(ఉల్లిగడ్డలు) మాత్రమే నిల్వ చేసుకోవచ్చా? లేకుంటే మిగిలిన కూరగాయలు కూడా నిల్వ చేసుకోవచ్చా అని సీఎం తెలుసుకున్నారు. సబ్జి కూలర్ గురించిన వివరాలను రైతులు ముఖ్యమంత్రికి వివరించారు.

కీరదోసకాయలు కొనుగోలు చేసిన సీఎం

కీరదోసకాయలు బాగున్నాయి.. ఎంతకి ఇస్తారని సీఎం చంద్రబాబు నాయుడు రైతుబజార్‌లో మహిళా రైతుని అడిగారు. కిలో ధర రూ.40 అని చెప్పారు. ముఖ్యమంత్రి స్వయంగా కిలో దోసకాయలను తూకం వేసుకొని కొనుగోలు చేశారు. అనంతరం డబ్బులు ఫోన్‌పే ద్వారా చెల్లించారు.

మిరపకాయలను చెత్తబుట్టలో వేసిన చంద్రబాబు

రైతుబజార్‌లో పర్యటిస్తుండగా సీఎం చంద్రబాబుకు నాలుగు మిరపకాయలు కిందపడి ఉన్నాయి. దీంతో వెంటనే మిరపకాయలను తీసుకుని చెత్తబుట్టలో వేశారు. పక్కనే ఉన్న పారిశుధ్య కార్మికుడు తాను తీస్తానని చెప్పినా స్వయంగా తానే వేశారు.



మిరపకాయలను చెత్తబుట్టలో వేస్తున్న సీఎం

చంద్రబాబుకు ఘన స్వాగతం





విమానాశ్రయంలో సీఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, మంత్రి ఎన్ఎండీ ఫరూక్, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, ఎమ్మెల్యేలు జయసూర్య, కేఈ శ్యాంబాబు, పార్థసారథి, మాజీ ఎమ్మెల్యేలు ఏరాసు ప్రతాప్ రెడ్డి, భూమా బ్రహ్మనందరెడ్డి, మాండ్ర శివానందరెడ్డి



చంద్రబాబుకు శ్రీవారి జ్ఞాపికను అందజేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత, టీటీడీ సభ్యుడు మల్లెల రాజశేఖర్, ఎంపీ బైరెడ్డి శబరి



టీడీపీ రాష్ట్ర నాయకులు వహీద్ హుస్సేన్, ధర్మవరం సుబ్బారెడ్డి, నాయకులు ఏవీ సుబ్బారెడ్డి, ఎన్.రాఘవేంద్ర రెడ్డి, ఎదురూరు విష్ణువర్ధన్ రెడ్డి, కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ విక్రాంత్ పాటిల్, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ




గ్రీన్‌కో ప్రతినిధులను సత్కరిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు

అడ్డదారిలో అక్రమ రవాణా..!

- ఫేక్ బిల్లులతో వరి బస్తాల తరలింపు
- రూ.లక్షల్లో ప్రభుత్వ ఆదాయానికి గండి
- కడప జిల్లాతో పాటు బేతంచెర్లలో లభ్యమైన నకిలీ బిల్లులు
- ఆలస్యంగా వెలుగులోకి...
- వ్యాపారిపై అవుకు పోలీసులకు ఫిర్యాదు





నకిలీ బిల్లులు ఇలా...

నంద్యాల, మే 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి ఎలాంటి పన్ను(సెస్) చెల్లించకుండా ఏకంగా ఓ వ్యాపారి ఫేక్ బిల్లులతో వరి బస్తాలను అడ్డదారిలో అక్రమ రవాణా చేసి రూ.లక్షల్లో సొమ్ముచేసుకోవడం పలు విమర్శలకు తావిస్తోంది. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి రావడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 10 లారీల్లో బస్తాలను అక్రమంగా ఓ వ్యాపారి తరలించి ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టాడు. చెక్ పోస్టుల్లో తమ వాహనాలను పట్టుకోకుండా ఉండేందుకు వీలుగా పది రోజుల రోజుల క్రితం కడప జిల్లా 'వ్యవసాయ మార్కెట్ కమిటీ' కమలాపురం పేరుతో ఫేక్ బిల్లులు సృష్టించి వరి బస్తాలను హైదరాబాదు, నెల్లూరు, కర్ణాటకకు తరలించి రూ.లక్షల్లో క్యాష్ చేసుకున్నారనే ఆరోపణలు లేకపోలేదు. నిబంధనల ప్రకారం ఏ వ్యాపారి అయినా వరి బస్తాలను లోడులో 25 టన్నులు తరలిస్తే.. మార్కెట్‌కు రూ.10వేలు, 30 టన్నులు తరలిస్తే రూ.12 వేలు చొప్పున పన్ను(సెస్) చెల్లించాల్సి ఉంటుంది. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు.. బనగానపల్లి నియోజకవర్గ పరిధిలోని అవుకు మండలానికి చెందిన ఓ వ్యాపారి కడప జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ కమలాపురం పేరుతో ఫేక్ బిల్లులు సృష్టించి గత కొంతకాలంగా మార్కెట్‌కు ఎలాంటి పన్ను చెల్లించకుండా ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ముచేసుకుంటున్నాడు. తాజాగా పది రోజుల క్రితం కడప జిల్లా మీదుగా నెల్లూరుకు ఓ లారీ వెళ్లింది. ఆ తర్వాత కమలాపురం చెక్‌పోస్టులో ఆ శాఖ అధికారులు రికార్డులను పరిశీలిస్తుండగా.. సదరు వ్యాపారి ఫేక్ బిల్లుల విషయం బయట పడింది. దీంతో వెంటనే సదరు అధికారులు ఆశాఖ జేడీ రామాంజనేయులు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఐదు రోజుల క్రితం జేడీ జిల్లాలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు ఏడీ అబ్దుల్ రెహమాన్‌ను తీవ్రస్థాయిలో ఆదేశించారు.

● బేతంచెర్లలో వెలుగులోకి...

జేడీ ఆదేశాలతో సదరు ఏడీ దర్యాప్తు ముమ్మరం చేయగా.. జిల్లాలోని 24 చెక్ పోస్టుల్లోని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. దీంతో బేతంచెర్ల చెక్‌పోస్టులో సేమ్ ఫేక్ బిల్లులతో పలుమార్లు వెళ్లినట్లు నిర్ధారణ అయిందని సమాచారం. దీంతో అక్కడి బిల్లులతో పాటు ఇక్కడి బిల్లులను స్వాధీనం చేసుకుని లారీలు ఎప్పుడెప్పుడు వెళ్లాయో లోతుగా విచారణ చేస్తున్నారని సమాచారం. అయితే అక్రమంగా తరలించిన లారీలకు సంబంధించిన యజమాని డోన్ ప్రాంతానికి చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు సమాచారం. సదరు వ్యక్తి సమాచారంతో అక్రమ రవాణాకు పాల్పడిన వ్యాపారి అవుకు మండలానికి చెందిన వ్యక్తిగా అధికారులు గుర్తించారు. ఇదిలా ఉండగా అక్రమాలకు పాల్పడిన ఆ బియ్యం వ్యాపారి హైదరాబాదు, కర్ణాటకలోని శిరిగుప్ప, నెల్లూరు, చైన్నై ప్రాంతాలకు ఎక్కువగా వరి బస్తాలను తరలిస్తున్నట్లు తెలిసింది.

అవుకు పోలీసులకు ఫిర్యాదు

తాజాగా లభ్యమైన ఫేక్ బిల్లుల ఆధారంగా చెక్‌పోస్టులో నమోదైన లారీ యజమాని చెప్పిన వివరాలను ఆధారంగా చేసుకుని ఆశాఖ అధికారులు రెండు రోజుల కిందట సదరు వ్యాపారిపై అవుకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. దీంతో పోలీసులు కూడా దర్యాప్తు ముమ్మరం చేసినట్లు సమాచారం. అయితే సదరు వ్యాపారి కేసులో తాను లేకుండా చూసేందుకు పోలీసులపై ఒత్తిడి చేసినట్లు తెలిసింది. అయితే సంబంధిత మార్కెటింగ్ శాఖ అధికారులు తగిన ఆధారాలతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.



ఫేక్ బిల్లులు వాస్తవమే



ఫేక్ బిల్లులతో వరి బస్తాలను ఓ వ్యాపారి అక్రమంగా తరలించారనే విషయం వాస్తవమే. ఉన్నతాధికారులు ఆదేశాలు మేరకు దర్యాప్తు చేశాం. కొన్ని ఆధారాలతో సదరు వ్యాపారిపై పోలీసులకు ఫిర్యాదు చేశాం. భవిష్యత్‌లో అక్రమ రవాణా జరగకుండా చెక్ పోస్టులను పటిష్టం చేస్తాం. ఇలాంటి అక్రమ వ్యాపారులపై ప్రత్యేక నిఘా ఉంచుతాం.

– అబ్దుల్ రెహమాన్,
ఏడీ, జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ

బావిలో పడి విద్యార్థి మృతి

ఆత్మకూరు రూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపురం గ్రామంలో కుందూరు చరణ్‌కుమార్‌రెడ్డి (16) అనే విద్యార్థి శనివారం మధ్యాహ్నం ఆడుకుంటూ ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. సీఐ రాము తెలిపిన వివరాలివీ.. వెంకటాపురం గ్రామ నివాసి అయిన కుందూరు రామచంద్రారెడ్డి కుమారుడు కుందూరు చరణ్‌కుమార్‌రెడ్డి 9వ తరగతి పూర్తయింది. వేసవి సెలవులు కావడంతో శనివారం తన తోటి స్నేహితులతో కలిసి వెంకటాపురం గ్రామ శివార్లలోని ఆడుకోవడానికి వెళ్లారు. ఈ క్రమంలో అక్కడి బావిలో ప్రమాదవశాత్తు పడిపోయాడు. చరణ్‌కు ఈత రాకపోవడంతో నీళ్లలో మునిగిపోయాడు. ఈ విషయాన్ని స్నేహితులు అక్కడ పొలాల్లో పని చేసే వారికి తెలిపారు. రైతులు కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం లేక పోయింది. బావిలో నీరు అధికంగా ఉండటంతో అగ్నిమాపక సిబ్బంది సాయంతో గ్రామస్థులు చరణ్ మృతదేహాన్ని బయటకు తీశారు. కాగా అప్పటికే చరణ్ నీళ్లలో ఊపిరాడక చనిపోయాడు. చేతికి అంది వచ్చిన కుమారుడు అకస్మాత్తుగా చనిపోవడంతో తల్లిదండ్రుల రోదనలు పలువురిని కలిచివేసింది. ఘటనా స్థలాన్ని సీఐ పరిశీలించారు. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం చరణ్ మృతదేహాన్ని ఆత్మకూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఏసీబీకి చిక్కిన ఉద్యోగులు కోర్టుకు హాజరు

రుద్రవరం, మే 17 (ఆంధ్రజ్యోతి): లంచం తీసుకుంటున్న ఏసీబీకి చిక్కిన విద్యుత్ శాఖ డీఈఈ రవికాంత్ చౌదరి, ఔట్ సోర్సింగ్ ఉద్యోగి ప్రతాప్‌ను సీబీఐ కోర్టుకు హాజరుపరిచారు. ఏసీబీ అధికారులు శనివారం కర్నూలులోని సీబీఐ కోర్టు న్యాయాధికారి శోభారాణి ముందు అవినీతి ఉద్యోగులను హాజరుపర్చగా రిమాండ్‌కు ఆదేశించారు. ఏసీబీ డీఎస్పీ సోమన్న, సీఐలు క్రిష్ణయ్య, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

రైతు పొలంలో ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభం ఏర్పాటు

రుద్రవరం, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నకంబలూరు గ్రామానికి చెందిన రైతు యడవల్లి లింగమూర్తి పొలంలో విద్యుత్ శాఖ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. శనివారం విద్యుత్ శాఖ ఈఈ శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు లింగమూర్తి పొలంలో రెండు విద్యుత్ స్తంభాలు, ఒక ట్రాన్స్‌ఫార్మర్‌ను సబ్ ఇంజనీర్ రాజశేఖర్ దగ్గరుండి ఏర్పాటు చేయించారు.

ప్రతిపక్షాల నోరు నొక్కడం మానుకోవాలి

- కాంగ్రెస్ నాయకుల అరెస్ట్ దారుణం
- నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్



లక్ష్మీనరసింహ యాదవ్‌ను స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

నంద్యాల రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపక్షాల నోరు నొక్కడం మానుకోవాలని నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్ అన్నారు. శనివారం కర్నూలుకు వచ్చిన సీఎం చంద్రబాబు నాయుడుకు సూపర్ సిక్స్ పథకాలు అమలుచేయాలని వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్తుంటే కాంగ్రెస్ నాయకులను అరెస్ట్ చేయడం దారుణమన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నివర్గాల వారిని రాష్ట్రప్రభుత్వం మోసంచేస్తుందని ఆరోపించారు. ప్రజాస్వామ్య విలువల కోసం నిరంతరం పోరాటం చేస్తామన్నారు. ప్రభుత్వ ఏర్పడి ఏడాది కావస్తున్నా ఇప్పటికీ చాలా పథకాలు మరుగునపడ్డాయని ఎద్దేవా చేశారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల కాంగ్రెస్ ఇన్‌చార్జీలు, మండల నాయకులు పాల్గొన్నారు.

చిట్టీల పేరుతో కుచ్చుటోపీ

- రూ.35లక్షలు చెల్లించకుండా ఉడాయించిన వ్యాపారి
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు

ప్యాపిలి, మే 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఓ వ్యాపారి చిట్టీల పేరుతో దగా చేశాడు. ప్రజలకు చెల్లించాల్సిన రూ.35లక్షల చిట్టీ డబ్బులతో ఉడాయించాడు. దీంతో బాధితులు శనివారం స్థానిక పోలీసుస్టేషన్‌లో వ్యాపారిపై ఫిర్యాదు చేశారు. పట్టణంలోని క్రిందిగేరిలో నివాసముంటున్న షేక్ సుభాన్ అనే వ్యక్తి ఐదారేళ్లుగా రూ.లక్ష నుంచి రూ.5లక్షల వరకు చిట్టీల వ్యాపారం చేస్తున్నాడు. ప్రారంభంలో చిట్టీ ఎత్తిన వెంటనే డబ్బులు చెల్లిస్తూ ప్రజలను నమ్మించాడు. దీంతో పలువురు షేక్ సుభాన్ దగ్గర చిట్టీలు కట్టేవారు. అయితే రెండేళ్లుగా చిట్టీలు ఎత్తిన వారికి డబ్బులు సరిగా చెల్లించలేదు. డబ్బుల గురించి అడిగితే మాయ మాటలు చెప్పి దాటవేసేవాడు. 20రోజుల నుంచి వ్యాపారి కనిపించడం లేదు. ఫోన్ కూడా స్విచ్ ఆఫ్‌లో ఉంది. దీంతో ఆందోళన చెందిన సభ్యులు వ్యాపారి ఇంటి దగ్గర వెళ్లి ఆరా తీశారు. కుటుంబ సభ్యుల నుంచి సరైన సమాధానం లేకపోవ డంతో కంగుతిన్న బాధితులు నరేంద్రకుమార్, ప్రభాకర్‌రెడ్డి, షేక్ హుసేన్, వెంకటేశ్, సర్వర్ సాహెబ్ తదితరులు పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. దగాచేసిన వ్యాపారిపై ఎస్ఐ మధుసూదన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో వ్యాపారిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సారూ.. పరిహారం అందించరూ

- కలెక్టర్‌కు పంచలింగాల, ఈ.తాండ్రపాడు వాసుల మొర

కర్నూలు అగ్రికల్చర్, మే 17 (ఆంధ్రజ్యోతి): రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి భూములను ఇచ్చామని, నష్టపరిహారం అందించాలని పంచలింగాల, ఈ.తాండ్రపాడు వాసులు కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. శనివారం కలెక్టర్ రంజిత్ బాషాను కలిసి తమ ఆవేదన వ్యక్తంచేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి 119.88 ఎకరాల భూమిని ఇచ్చినట్లు తెలిపారు. 2015లో ఆర్డీవో ఎకరానికి రూ.6,17,326లు వడ్డీ తదితర అన్ని కలిపి పరిహారంగా అందించేందుకు నిర్ణయించారు. అయితే.. ఈ మొత్తం మాకు సరిపోదని, మార్కెట్ విలువ మేరకు నష్టపరిహారాన్ని అందించాలని ప్రభుత్వానికి విన్నవించుకున్నామన్నారు. ఎకరాకు రూ.38,72,000 రైతులకు చెల్లించాలని, అప్పట్లో కోర్టు ఆ మొత్తాన్ని ఇవ్వాలని తీర్పు ఇచ్చిందన్నారు. ఇప్పటి దాకా ఆపరిహారాన్ని అందించకుండా అధికారులు నిర్లక్ష్యం చూపుతూ వచ్చారన్నారు. నష్టపరిహారం అందించడంలో జరిగిన జాప్యాన్ని, నిర్లక్ష్యాన్ని గుర్తించి పరిహారం అందించాలని కలెక్టర్ విన్నవించుకున్నట్లు రైతుల పోరాట సమితి ప్రతినిధులు నాగరాజు, వెంకటేశ్వర్లు, లింగన్న, గిరిజ, పద్మ, మద్దిలేటి, సునీత, నాగలక్ష్మీ, భాగ్యలక్ష్మి, జయమ్మ, అయ్యన్న, శ్రీరాములు తెలిపారు

ఇంటర్ పరీక్షల్లో 595 మంది గైర్హాజర్

కర్నూలు ఎడ్యుకేషన్, మే 17 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో శనివారం మొదటి, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 595 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉదయం ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలో 7,363 మంది విద్యార్థులకు గానూ 6859 మంది హాజరు కాగా 504 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం ద్వితీయ సంవత్సరం పరీక్షకు 1306 మంది నమోదు చేసుకున్నారు.1215 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 91 మంది గైర్హాజరయ్యారు. మొత్తం ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యా ర్థులు 595 మంది గైర్హాజరైనట్లు ఆర్ఐవో గురువయ్య శెట్టి తెలిపారు. ఎలాంటి మాల్‌ప్రాక్టీసు కేసు నమోదు కాలేదు. పరీక్ష కేంద్రాలను కన్వీనర్, ఆర్ఐవో ఎస్‌వీఎస్ గురువయ్య శెట్టి, డీవీఈవో సురేష్‌బాబు, జిల్లా డీఈసీ సభ్యులు, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ సభ్యులు పర్యవేక్షించారు.

క్షణికావేశంలో ఇనుపరాడ్డుతో కొట్టి హత్య



మాట్లాడుతున్న సీఐ కిరణ్‌కుమార్ రెడ్డి

- ఆనవాళ్లు లేకుండా యాసిడ్ పోసి శవం కాల్చివేత
- ఎముకలను దంచి పొడిచేసి పెట్రోల్ పోసి దహనం
- గువ్వల రాజు హత్య కేసులో నిందితుల అరెస్టు
- ద్విచక్రవాహనాలు, సెల్‌ఫోన్లు, ఇనుపరాడ్డు స్వాధీనం
- పాణ్యం సీఐ కిరణ్‌కుమార్ రెడ్డి
- కేసును ఛేదించిన పోలీసులకు ప్రశంసలు

పాణ్యం, మే 17 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి క్షణికావేశంలో ఇనుపరాడ్డుతో కొట్టి గువ్వల రాజును హత్యచేసినట్లు సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పాణ్యం సర్కిల్ పరిధిలోని గడివేములలో ఇటీవలే జరిగిన హత్య కేసులో నిందితులను అరెస్టుచేశారు. శనివారం సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నిందితులను హాజరుపరిచి సీఐ వివరాలు వెల్లడించారు. ఈనెల 9వ తేదీన గడివేములకి చెందిన గువ్వల జనార్దన్ తన తమ్ముడు గువ్వల రాజు 14రోజుల నుంచి కనబడటం లేదని గడివేముల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుచేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేశారు. 10వ తేదీన గ్రామ పొలిమేరలోని అబ్దుల్‌రహిమాన్ పొలంలో గుర్తుతెలియని ఎముకలు ఉన్నాయని వీఆర్వో ఇచ్చిన సమాచారం మేరకు పాణ్యం, గడివేముల ఎస్ఐలు నరేంద్రకుమార్‌రెడ్డి. నాగార్జున రెడ్డి వెళ్లి పరిశీలించారు. ఎముకలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. అనంతరం గువ్వల రాజుతో పాటు కలిసి తిరిగేవారి వివరాలు సేకరించారు. వీరిలో కె. బొల్లవరం గ్రామానికి చెందిన మేకల మహేంద్ర, బిలకలగూడూరుకు చెందిన కొత్త లోకేశ్ గువ్వలరాజును బైక్‌పై అబ్దుల్‌రహీం మొక్కజొన్న పొలం వద్దకు తీసుకెళ్లారు. ముగ్గురు మద్యం సేవించారు. మాటమాట పెరిగి క్షణికావేశంలో మహేంద్ర గువ్వలరాజు తలపై ఇనుపరాడ్డుతో కొట్టాడు. దీంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. రాడ్డును సమీప కుందూ వాగులో వేసినట్లు తెలిపారు. ఆ తర్వాత శవాన్ని గుర్తుపట్టకుండా చేయాలనే ఉద్దేశంతో మేకల మహేంద్ర, తన స్నేహితుడు గడివేముల గ్రామానికి చెందిన మానికింది పెద్దరాయుడుతో కలిసి 24వతేదీ, 26న తేదీలలో శవం ఆనవాళ్లు లేకుండా యాసిడ్ పోసి కాల్చివేశారు. ఎముకులు ఏరుకొని రాళ్లతో దంచి పొడిచేసి వాటిపై పెట్రోల్ పోసి దహనం చేశారన్నారు. బూడిదను దగ్గరలోని కుందూలో వేసినట్లు తెలిపారు. నిందితులను ఈనెల 16వ తేదీన గడివేముల పరిధిలో అరెసుచేసి వారివద్ద నుంచి రెండు మోటారు సైకిళ్లు, ఐదు సెల్‌ఫోన్లు, ఐరన్‌రాడ్డు, చున్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎస్ఐ నాగార్జునరెడ్డి, పోలీసుసిబ్బంది పాల్గొన్నారు. ఇదిలా ఉండగా త్వరితగతిన కేసును ఛేదించి నిందితులను అదుపులోకి తీసుకున్న నంద్యాల డీఎస్పీ మందా జావళి, పాణ్యం సీఐ కిరణ్ కుమార్ రెడ్డి, ఎస్ఐలను ఉన్నతాధికారులు అభినందించారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం



బొల్లవరం గ్రామంలో పారిశుధ్య పనులు చేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య, మాండ్ర శివానందరెడ్డి



కలెక్టరేట్ ఆవరణలో సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఆర్వో రామునాయక్



నందికొట్కూరు ప్రజలకు ఎండల వల్ల జరిగే నష్టాలపై వివరిస్తున్న మున్సిపల్ కమిషనర్, అధికారులు

హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి

నందికొట్కూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. శనివారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలలో ఒకటి రెండు మినహా పెన్షన్లు, డీఎస్సీ విడుదల తప్ప సూపర్ సిక్స్ పథకాలు ఎక్కడ అమలు కావడం లేదన్నారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాల అభివృద్ధి స్థానంలో కేవలం అమరావతి, పోలవరం అనే జపం చేస్తూ ఈ ప్రభుత్వం కాలం వెళ్ల దీస్తోందన్నారు. పొగాకు వేసిన రైతుల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. మిడ్తూరు మండలంలో ఎత్తిపోతల పథకాన్ని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే అలగనూరు రిజర్వాయర్‌కు కుంగిన బండ్‌కు మరమ్మత్తులు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు నాగేశ్వరరావు, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, సీఐటీయూ జిల్లా నాయకులు గోపాలకృష్ణ, ఉస్మాన్ బాష, ఉస్మాన్‌బాషా, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టును భర్తీ చేయండి



కమిషనర్ బేబికి వినతిపత్రం సమర్పిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

నందికొట్కూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఖాళీగా ఉన్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టును భర్తీ చేయాలని ఏఐటీయూసీ నంద్యాల జిల్లా అధ్యక్షులు రఘురాంమూర్తి అన్నారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ బేబి, చైర్మన్ సుధాకర్‌రెడ్డికి వేరువేరుగా వినతిపత్రాలు సమర్పించారు. పారిశుధ్య కార్మికులకు మేస్త్రీగా ఏ అర్హతలు లేని వ్యక్తులను కొందరు నియమించడంతో పట్టణంలో పారిశుధ్యం కొరవడిందన్నారు.

టీడీపీ సభ్యత్వంతో కుటుంబానికి భరోసా



ఎ.కోడూరులో సభ్యత్వ కార్డులు అందజేస్తున్న టీడీపీ నాయకులు

బండిఆత్మకూరు, మే17(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకోవడం ద్వారా నాయకులు, కార్యకర్తల కుటుంబాలకు కొండంత భరోసా అని టీడీపీ నాయకులు వడ్డు మధుసూదన్‌రెడ్డి, కెసీ నీటి సంఘం అధ్యక్షుడు శంకర్‌రెడ్డి, దేరెడ్డి శ్రీనివాసరెడ్డి సూచించారు. శనివారం మండలంలోని ఏకోడూరు గ్రామంలో మం డల సోషల్ మీడియా సమయ్వకర్త నర్ల నాగేశ్వరరెడ్డి సమక్షంలో గ్రా మంలో సభ్యత్వ కార్డుల పంపిణీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు జయరామిరెడ్డి, శివకుమార్, హనుమంతరెడ్డి, బూత్ కన్వీనర్లు శంకర్, సురేష్ పాల్గొన్నారు.

నీటి తొట్లను శుభ్రంగా ఉంచాలి

పగిడ్యాల, మే 17 (ఆంధ్రజ్యోతి): మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటుచేసిన నీటి తొట్లను శుభ్రంగా ఉంచుకోవాలని మండల ప్రత్యేక అధికారి పరమేశ్వరి సూచించారు. నెహ్రూనగర్‌లో ఏర్పాటు చేసిన నీటి తొట్టిలను ఆమె శనివారం పరిశీలించారు. నీటి తొట్టిలలో రోజులు తరబడి నీరు నిల్వ ఉండటంతో రంగుమారి దుర్వాసన వస్తుందని, ఆ నీటిని పశువులు తాగితే ఇబ్బదులు వస్తాయని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజేశ్వరి, ఎంపీడీవో సుమిత్రమ్మ సిబ్బంది ఉన్నారు.

రాష్ట్ర సమావేశాన్ని విజయవంతం చేయండి



పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

నంద్యాల నూనెపల్లె, మే 17 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం 3వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేంద్రప్ప పిలుపునిచ్చారు. శనివారం నంద్యాలలోని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో రాష్ట్ర సమావేశ గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా నాగేంద్రప్ప మాట్లాడుతూ జూన్ 5న విజయవాడలో జరిగే రాష్ట్ర కౌన్సిల్ సమావేశానికి ఉద్యోగులు అధికసంఖ్యలో హాజరుకావాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు, రాయితీలు, పీఆర్సీ గురించి చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా సహాధ్యక్షుడు శ్రీహరి, జిల్లా కోశాధికారి శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షులు సునీల్‌కుమార్, జగదీశ్వరప్ప, విజయలక్ష్మి, డేవిడ్ సుందరం, సిటీ అధ్యక్షుడు సత్యం, సిటీ మహిళా కమిటీ నాయకురాళ్లు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్, అధికారులు

పాములపాడు, మే 17 (ఆంధ్రజ్యోతి) : పాములపాడులో వేసవిలో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు మండల ప్రత్యేక అధికారి రాజ్ తెలిపారు. శనివారం బస్టాండు వద్ద సర్పంచ్ మేకల బాగ్యమ్మ, ఏపీవో అలివేలు మంగమ్మ, ఏపీఎం ఉమామహేశ్వరీ, పంచాయతీ కార్యదర్శి నాగశేషులుతో కలిసి చలివేంద్రాన్ని ప్రారంభించారు. అలాగే మూడవ శనివారం సందర్భంగా స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో కార్యలయం నుంచి బస్టాండ్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు పారిశుధ్య చర్యలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే స్వచ్ఛాంధ్ర సాధ్యం

నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు రూరల్, మే17 (ఆంధ్రజ్యోతి) : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొంటేనే 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర' సాధ్యమని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. శనివారం నందికొట్కూరు మండలంలోని బొల్లవరం గ్రామంలో ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే జయసూర్య, నంద్యాల పార్లమెంట్ టీడీపీ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ఇరువురూ చీపురులు పట్టుకొని అధికారులతో కలిసి పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' సభా కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్రప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామస్థులు, అధికారులతో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ సుబ్రమణ్యశర్మ, సీనియర్ టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్ర నాథరెడ్డి, మాజీ ఎంపీపీ వీరం ప్రసాదరెడ్డి, గ్రామసర్పంచ్ వీరం జయలక్ష్మమ్మ, వీరం రాఘవరెడ్డి, యాదవ కార్పోరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, ద్వారం లక్ష్మీనారాయణరెడ్డి పాల్గొన్నారు.

నందికొట్కూరు: ఎండతీవ్రతకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మున్సిపల్ కమిషనర్ పట్టణ ప్రజలకు వివరించారు. శనివారం 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంతో పాటు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఆధ్వర్యంలో ఎండ తీవ్రత వల్ల కలిగే నష్టాలపై మున్సిపల్ కార్యాలయం నుంచి పటేల్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ బేబి మాట్లాడుతూ వడదెబ్బ లక్షణాలు, తలనొప్పి, తల తిరగడం, తీవ్రమైన జ్వరం కలిగియుండటం, మత్తు నిద్ర, ఫిట్స్, పాక్షిక లేదా పూర్తి అపస్మారక స్థితి, ఇలాంటి లక్షణాలు కలుగుతాయని సూచించారు. ఎండలో గొడుగు లేకుండా తిరగరాదన్నారు.

బండిఆత్మకూరు: ప్రతి ఒక్కరూ స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రలో సాలుపంచుకోవాలని మండల స్పెషల్ ఆఫీసర్ అబ్దుల్ రహెమాన్, ఎంపీడీవ దస్తగిరి, తహసీల్దార్ పద్మావతమ్మ సూచించారు. శనివారం బండిఆత్మకూరులో జరిగిన కార్యక్రమాల్లో వారు పాల్గొన్నారు. 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'లో భాగంగా ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, చలివేంద్రంలో మంచినీరు, పార్నపల్లెలో మజ్జిగ ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల మండల అధికారులు, నాయకులు సిబ్బంది పాల్గొన్నారు.

మహానంది: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో మహమ్మద్ దౌలా తెలిపారు. శనివారం మహానంది మండలం ఎం.తిమ్మాపురంలో పంచాయతీ కార్యదర్శి కలువ భాస్కర్ ఆధ్వర్యంలో 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' నిర్వహించారు. సర్పంచ్ కల్లె శ్రీలక్ష్మి, అధికారులు మొక్కలు నాటించారు. ప్రత్యేకాధికారి మురళీకృష్ణ, ఎంపీహెచ్‌ఈవో ఉసేన్‌రెడ్డి,టెక్నికల్ అసిస్టెంట్ హేమశంకర్ పాల్గొన్నారు.

పగిడ్యాల: 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా నెహ్రూనగర్ గ్రామంలో ప్రత్యేకాధికారిని పరమేశ్వరి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా ఉండటంతో జన సంచారం కలిగిన ప్రదేశాలలో చలువ పదిరిలు ఏర్పాటు చేయడంతో పాటు చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుమిత్రమ్మ, సిబ్బంది ఉన్నారు.

● నెహ్రూనగర్ సచివాలయం, పొదుపు సంఘం భవనాల చుట్టు చెత్త, చెదారం, మందు సీసాలు దర్శనమివడంతో మండల ప్రత్యేకాధికారి పరమేశ్వరి స్వంచ్ఛాంధ్ర అంటే ఇదేనా అని పంచాయతీ కార్యదర్శి వీరన్న, పొదుపు మహిళలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రత్యేకాధికారిని పరమేశ్వరి, ఎంపీడీవో సుమిత్రమ్మ ఉదయం సచివలయం వద్దకు చేరుకున్నారు. పారిశుధ్యంపట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కార్యదర్శికి హెచ్చరించారు.

నంద్యాల నూనెపల్లె: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'లో భాగంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా కృషిచేయాలని డీఆర్వో రామునాయక్ అన్నారు. శనివారం కలెక్టరేట్ ఆవరణలో ఈ కార్యక్రమంలో భాగంగా పిచ్చిమొక్కలు, వ్యర్థపదార్థాలను కలెక్టరేట్‌లోని వివిధ సెక్షన్ల అధికారులు, సిబ్బంది తొలగించారు. సిబ్బందితో డీఆర్వో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల హాస్పిటల్: నంద్యాల పట్టణంలోని పద్మావతినగర్‌లో ఉన్న జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ మైదానంలో శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. క్రీడామైదానాన్ని శుభ్రం చేశారు. అనంతరం క్రీడాకారులు, కోచ్‌లు స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో శిక్షకులు కిశోర్, క్రీడాకారులు, మైదానంలో వ్యాయామం చేసేవారు పాల్గొన్నారు.

ఆత్మకూరు: పచ్చదనంతోనే సురక్షితమైన జీవనం సాగించవచ్చునని ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి పేర్కొన్నారు. ఈ సందర్భంగా శనివారం స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రతిఒక్కరు సామాజిక బాధ్యతగా మొక్కలు పెంచాలని అన్నారు. ఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రత్నరాధిక ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కార్యాలయ ఉద్యోగులు, సిబ్బందితో కలిసి స్వచ్ఛ అంధ్ర - స్వచ్ఛ దివాస్ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్‌లు ఆంజనేయులు, మనోహర్ తదితరులు ఉన్నారు.

● పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, కోఆప్షన్ సభ్యులు ఎంఏ.రషీద్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి గౌడ్‌సెంటర్ వరకు మున్సిపల్ వర్కర్లు, సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు.

● ఆత్మకూరు పట్టణంలోని గౌడ్‌సెంటర్‌లో మున్సిపల్‌శాఖ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. శ్రీశైలం ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ వంగాల శివరామిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎంఏ.రషీద్, టీడీపీ పట్టణాధ్యక్షులు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్లాపురం బాషాలు తొలి రోజు మజ్జిగ పంపిణీ చేపట్టారు.



తిమ్మాపురంలో మొక్క నాటి నీళ్లు పోస్తున్న అధికారులు



తహసీల్దార్ కార్యాలయంలో మొక్కలు నాటుతున్న తహసీల్దార్ రత్నరాధిక



నెహ్రూనగర్‌లో ర్యాలీ చేస్తున్న అధికారులు, ప్రజలు

ఓటర్ల జాబితా రూపకల్పనకు సహకరించాలి



రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన డీఆర్వో

నంద్యాల నూనెపల్లె, మే 17 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛమైన ఓటర్ల జాబితాను రూపకల్పన చేసేందుకు అన్ని రాజకీయ పార్టీ ప్రతినిధులు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని డీఆర్వో రామునాయక్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని డీఆర్వో చాంబర్‌లో ఓటర్ల జాబితా రూపకల్పనపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో డీఆర్వో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్‌లవారీగా ఓటర్ల జాబితాను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశామని అందులో డెత్ ఓటర్లు, చేర్పులు, మార్పులు, బూత్ స్థాయి ఏజెంట్లతో పరిశీలించి ఏవైనా అభ్యంతరాలుంటే ఈఆర్వో, ఏఆర్వోలకు తెలియజేయాలని సూచించారు. పార్టీ ప్రతినిధులు సూచించిన అంశాలను ఎన్నికల సంఘానికి నివేదిస్తామని డీఆర్వో తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ 80ఏళ్ల పైబడినవారికి హోం ఓటింగ్‌కు ఎలా అవకాశం కల్పిస్తారో అదేరీతిలో గర్భిణులకు కూడా చర్యలు తీసుకోవాలని డీఆర్వోను కోరారు. పురుష, మహిళా ఓటర్లకు కేటాయించిన పోలింగ్ బూత్‌ల్లో కుటుంబ సభ్యులందరికీ ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో బహుజన సమాజ్ పార్టీ, సీపీఎం, బీజేపీ, టీడీపీ, వైసీపీ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో అప్రజాస్వామిక పాలన



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి

నంద్యాల రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో అప్రజాస్వామిక పాలన కొనసాగుతుందని నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఇషాక్‌బాషాతో కలిసి ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్న రాష్ట్రం అన్ని విదాల తిరోగమనంలోకి వెళ్లిందన్నారు. కూటమి ప్రభుత్వం అరాచాకాలు, దౌర్జన్యాలు, రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని ప్రజలు గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారన్నారు. ప్రజలకిచ్చిన సూపర్‌సిక్స్ హామీల ఊసేలేదని, అడిగిన వైసీపీ నాయకులు, కార్యకర్తలను జైళ్లో పెట్టడమే కూటమి ప్రభుత్వ విధానమని ఆరోపించారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడవడానికి, రాజ్యాంగ విలువలను కాపాడడానికి కృషి చేయాలని హితవు పలికారు.

పొగాకు కొనుగోళ్లను వెంటనే ప్రారంభించాలి



పొగాకు రైతులతో మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం నాయకులు

ఆత్మకూరు, మే 17(ఆంధ్రజ్యోతి): పొగాకు కొనుగోళ్లను జాప్యం లేకుండా వెంటనే ప్రారంభించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఆత్మకూరు మండలంలోని కరివేన గ్రామంలో తడిసిన పొగాకును వారు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పొగాకు కంపెనీలు రైతులతో ఒప్పందం కుదుర్చుకుని చివరకు దిగుబడులు రాగానే కొనుగోలు చేయకుండా ఆలస్యం చేయడం సరికాదని అన్నారు. నంద్యాల జిల్లాలో సుమారు 36వేల ఎకరాల్లో రైతులు పొగాకు పండించారని, ఇందులో కౌలు రైతులు కూడా ఉన్నారని అన్నారు. అయితే పొగాకు కంపెనీలు కొనుగోలులో చేస్తున్న జాప్యం వల్ల రైతులు నష్టపోతున్నారని చెప్పారు. జీపీఐ కంపెనీ కొంత కొనుగోలు ప్రారంభించినా 3నెలల నుంచి పంటను కొనుగోలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం ఈ విషయంలో రైతులకు న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. ఈయన వెంట ఆ సంఘం నాయకులు వీరన్న ఉన్నారు.

లింగనిర్ధారణ చేస్తే చట్టపరమైన చర్యలు



భ్రూణహత్యల నివారణపై సమీక్షిస్తున్న అధికారులు

ఆత్మకూరు, మే 17(ఆంధ్రజ్యోతి): లింగనిర్ధారణ, భ్రూణహత్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి, ఎస్ఎల్ఏసీ చైర్మన్ కాంతరావు పేర్కొన్నారు. శనివారం ఆర్డీవో కార్యాలయంలో సబ్ డివిజనల్ మల్టీ మెంటర్ అప్రాప్రియేట్ అథారిటీ, సబ్ డిస్ట్రిక్ లెవల్ అడ్వయిజరీ కమిటీ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆత్మకూరు డివిజన్ పరిధిలో బాలికల నిష్పత్తి తక్కువగా ఉందని అన్నారు. ఇందుకోసం లింగనిర్ధారణతో భ్రూణహత్యలు జరగకుండా ఎప్పటికప్పుడు స్కానింగ్ కేంద్రాల్లో తనిఖీలు చేపట్టాలని నిర్ణయించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాలతో పాటు కఠిన చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు. అదే విధంగా పీసీపీఎన్‌డీటీ చట్టం గురించి విద్యాలయాల్లో, ప్రసార మాధ్యమాల ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో ఆత్మకూరు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ రాయుడు, ఏపీపీ సుస్మిత, పీసీపీఎన్‌డీ ఆర్గనైజర్ మద్దిలేటి, హెల్త్ ఎడ్యుకేటర్ ధనలక్ష్మీ, ఎన్‌జీవో ప్రతినిధి జుల్ఫీకర్ అలిఖాన్ తదితరులు ఉన్నారు.

సర్వీసు రోడ్డు నిర్మించాలి



అండర్‌పాస్ బ్రిడ్జి వద్ద మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే లబ్బి

పాములపాడు, మే 17 (ఆంధ్రజ్యోతి) : పాములపాడులోని గ్రామ శివార్లలోని చెలిమిళ్ళ రహదారిలో నేషనల్ హైవే 340సి నిర్మాణపు పనుల్లో నిర్మిస్తున్న అండర్‌పాస్ బ్రిడ్జి ఎత్తును పెంచి, సర్వీస్ రోడ్డు నిర్మించాలని మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి డిమాండ్ చేశారు. శనివారం ఆయన నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించి మాట్లాడారు. ఈ రహదారిపై పవిత్ర పుణ్య క్షేత్రాలు సంగమేశ్వరం, కొలనుభారతీ క్షేత్రాలకు నిత్యం వాహనాలు రాకపోకలు సాగిస్తాయన్నారు. అంతేకాక రాబోయే రోజుల్లో కల్వకుర్తి, తిరుపతికి సంబంధించి 167 రహదారి పనులు కూడా ప్రారంభమవుతున్నాయని అన్నారు. హైవే నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదన్నారు. గ్రామాల్లోని ప్రజలకు ఇబ్బందులు లేకుండా రహదారులు నిర్మించాలని అన్నారు. కార్యక్రమంలో కో ఆప్షన్‌మెంబర్ ముర్తుజావలి పాల్గొన్నారు.

నిర్దిష్టమైన విద్యా రూపకల్పన లేదు



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు

నంద్యాల ఎడ్యుకేషన్, మే 17 (ఆంధ్రజ్యోతి): నూతన విద్యావిధానంలో నిర్దిష్టమైన పూర్వ ప్రాథమిక విద్యా రూపకల్పన లేదని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు పేర్కొన్నారు. నంద్యాల హోలిక్రాస్ ఉన్నత పాఠశాలలో జిల్లా ఏపీటీఎఫ్ నాయకులు మాధవస్వామి, నగిరి శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించిన విస్తృత కార్యవర్గ సమావేశానికి వారు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. హృదయరాజు మాట్లాడుతూ పాఠశాలల పునర్విభజన, క్రమబద్ధీకరణ, చేసేందుకు ప్రభుత్వం విడుదల చేసిన 19,20,21 ఉత్తర్వులు అసంబద్ధంగా ఉన్నాయన్నారు. ఇందుకు నిరసనగా ఈనెల 21వ తేదీన ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో, 23వ తేదీన అమరావతిలో విద్యాభవన్ ముట్టడి కార్యక్రమాలను ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. జీవోల్లో తెలుగుమీడియం, మైనర్ మీడియంలను ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని అన్నారు. సబ్జెక్టు టీచర్లను ప్రాథమిక పాఠశాలలకు పంపడం, కొత్త ఉన్నత పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులు, పీఈటీలను కేటాయించకపోవడం, ఫౌండేషన్ స్కూల్స్‌లో 1:30 రేషియో అమలు చేయడం మంచిది కాదన్నారు. సమావేశంలో జిల్లా సబ్‌కమిటీ సభ్యులు ఉమర్, సుంకన్న, శ్రీరాములు, రవి, లింగమయ్య, రాష్ట్ర కౌన్సిలర్‌లు గోపాల్‌రావు, అబ్దుల్‌వహీద్ తదితరులు పాల్గొన్నారు.

20వ రోజుకు చేరిన సీహెచ్‌వోల ధర్నా

నంద్యాల హస్పిటల్, మే 17 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారానికి 20రోజుకు చేరుకుంది. నిర్దిష్టమైన జాబ్‌చార్ట్ అమలు చేయాలని ఈపీఎఫ్‌ఓ బెనిఫిట్‌ను పునరుద్ధరించాలని సీహెచ్‌వోలు డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూతమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సీహెచ్‌వోలు కోరారు. రాత్రి 8గంటలకు ఎఫ్ఆర్ఎస్ వేయాలని ఆదేశాలు జారీ చేయడాన్ని వారు తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రజలకు పంచాయతీ పరిధిలో ఆరోగ్య సేవలు అందిస్తున్న సీహెచ్‌వోల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలన్నారు. కార్యక్రమంలో సౌందర్య, గురుప్రసాద్, అఖిల్, భార్గవ్, చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

మహానంది ఆలయ పర్యవేక్షకుడిగా నీలకంఠేశ్వరరాజు



మహానంది, మే 17 (ఆంధ్రజ్యోతి): మహానంది ఆలయ సీనియర్ అసిస్టెంట్ ఎం. నీలకంఠరాజుకి దేవస్థానం పర్యవేక్షకుడిగా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి శనివారం తెలిపారు. గత 34 సంవత్సరాలుగా మహానంది దేవస్థానంలో వివిధ విభాగాల్లో పనిచేసిన నీలకంఠేశ్వర రాజుకి సీనియారిటీ ప్రతిపాదికన దేవస్థానం పర్యవేక్షకుడిగా పదోన్నతి కల్పించినట్లు చెప్పారు. ఈ మేరకు పలువురు ఆలయ సిబ్బంది ఆయనను అభినందించారు.

నాటుసారా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు

ఆత్మకూరు, మే 17(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మండలంలోని సిద్ధాపురం గ్రామంలో గల నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న భవనాశి వాగు వద్ద అక్రమంగా నిర్వహిస్తున్న నాటుసారా స్థావరాలపై శనివారం ఎక్సైజ్ శాఖ అధికారులు దాడులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆత్మకూరు, నందికొట్కూరు ఎక్సైజ్ సీఐలు కిశోర్‌కుమార్, రామాంజనేయులు మాట్లాడుతూ.. రాబడిన సమాచారం మేరకు నాటుసారా తయారీ స్థావరాలపై దాడులు చేపట్టి 1100 లీటర్ల బెల్లపు ఊటను నేలపాలు చేయడంతో పాటు తయారీకి వినియోగించిన సామగ్రిని ధ్వంసం చేసినట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ దాడుల్లో సిబ్బంది పాల్గొన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

ముగిసిన చెన్నకేశవుడి బ్రహ్మోత్సవాలు



అవుకు చెన్నకేశవస్వామి విగ్రహం ఊరేగింపు

అవుకు, మే 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వెలసిన శ్రీభూలక్ష్మీ సమేత చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఉదయం అర్చకులు స్వాముల వారికి పూజలు చేసి తీర్థవాది, ధ్వజారోహణం, వసంతోత్సవం కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తులను పల్లకిలో ఉంచి ఊరేగించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పట్టణంలో..

కోవెలకుంట్ల : పట్టణంలో వెలసిన పాండురంగ విఠలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. శనివారం ఉదయం 10గంటలకు స్వామివారికి చక్రస్నానం నిర్వహించారు. ఈ సందర్భంగా వసంతోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ గుద్దేటి గుండయ్య, సభ్యులు, నాయకులు ప్రసాద్‌రెడ్డి, గడ్డం నాగేశ్వర్‌రెడ్డి, గువ్వల సుబ్బారెడ్డి, పెనుగొండ రాజశేఖర్, మురళి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత అడవులే లక్ష్యం

రుద్రవరం, మే 17 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ రహిత నల్లమల అడవులే లక్ష్యమని రుద్రవరం ఫారెస్టు రేంజర్ శ్రీపతినాయుడు అన్నారు. శనివారం ఫారెస్టు రేంజ్‌లోని పాల్కన్ బేస్‌క్యాంపు పరిధిలోని సాయిబాబా గుడి నుంచి ఎగువ అహోబిళం వరకు ప్లాస్టిక్ కవర్లను తొలగించారు. ఈ సందర్భంగా రేంజర్ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. వన్యప్రాణులకు హానీ తలపెడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్లు శ్రీనివాసరెడ్డి, మక్తర్‌బాషా, రామక్రిష్ణ, రా జెమ్మ, బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఓబులేసు

చాగలమర్రి, మే 17 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులు సమయ పాలన పాటిస్తూ విధుల పై అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని బీసీ సంక్షేమశాఖ జిల్లా అధికారి ఓబులేసు అన్నారు. శనివారం చాగలమర్రి రెండవ సచివాలయాన్ని తనిఖీ చేశారు. వివిధ రికార్డులను పరిశీలించారు. ఇంజనీరింగ్ సహాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. లేఔట్‌ల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ రవి కుమార్, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ ఉన్నారు.

హుండీ ఆదాయం రూ.5.42 లక్షలు

చాగలమర్రి, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లాల క్షేత్రంలో చెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వరస్వామి ఆలయాలకు సంబంధించిన హుండీ లెక్కింపు శనివారం పర్యావేక్షణాధికారి మల్లికార్జునప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా వచ్చిన హుండీ ఆదాయం రూ.5.42 లక్షలు వచ్చిందని పర్యావేక్షణాధికారి తెలిపారు. కార్యక్రమంలో ఈవో కేవీ రమణ, ఆలయ కమిటీ ఛైర్మన్ నారాయణరెడ్డి, అర్చకులు, సభ్యులు పాల్గొన్నారు.

అధిక రక్తపోటు.. ప్రాణాలకు ముప్పు

బనగానపల్లె, మే 17 (ఆంధ్రజ్యోతి): అధిక రక్తపోటుతో ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివశంకరుడు అన్నారు. శనివారం ప్రపంచ అధిక రక్తపోటు దినం సందర్భంగా బనగానపల్లె సచివాలం - 5లో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సరస్వతి, హెల్త్ సూపర్‌వైజర్ అయ్యమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

వడదెబ్బ సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

ఉయ్యాలవాడ, మే 17 (ఆంధ్రజ్యోతి) : వడదెబ్బ సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డ్వామా పీడీ, మండల ప్రత్యేక అధికారి శ్రీధర్‌రెడ్డి సూచించారు. శనివారం అల్లూరు గ్రామంలో పర్యటించారు. ఎంపీడీవో ఉమామహేశ్వర్‌రావు, గ్రామ సర్పంచ్ క్రిష్ణవేణి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడి స్వచ్ఛంధ్ర స్వచ్ఛదివస్ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ వెంకటేశ్వర్‌రావు, వైద్యాధికారి డాక్టర్ కెనడీ, వెలుగు ఏపీఎం దాసన్న, ఎంఈవో రఘురామిరెడ్డి పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్రలో భాగస్వాములవుదాం

సంజామల, మే 17(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్రలో భాగస్వాములవుదామని తహసీల్దార్ అనిల్ కుమార్, ఎంపీడీవో సాల్మన్ అన్నారు. శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో ప్రధాన రహదారి వెంట ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాత పోలీసు స్టేషన్ వద్ద మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేయించారు. తహసీల్దారు కార్యాలయం వద్ద చలివేంద్రం ప్రారంభించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రాధికారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ తులసిక్రిష్ణ, సర్వేయర్లు క్రిష్ణయ్య, మల్లీశ్వరి, వీఆర్‌వోలు , కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు నాటుదాం

రుద్రవరం, మే 17 (ఆంధ్రజ్యోతి) : మొక్కలు నాటుదాం, పచ్చదనం పెంచుదామని మండల ప్రత్యేక అధికారి నాగరాజు అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల ముందు మొక్కలు నాటి పచ్చదనం అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో భాగ్యలక్ష్మి, ఏపీవో గౌరీబాయి, ఏవో సుబ్రహ్మణ్యం తదితరులున్నారు. అలాగే రుద్రవరం, నరసాపురంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ర్యాలీ చేశారు. అధికారులు స్వచ్ఛంధ్ర ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు మల్లికార్జునరావు, వైద్యాధికారి బాబు, ఏఈ కమాల్‌సాహెబ్, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

చాగలమర్రి, మే 17 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని మండల ప్రత్యేక అధికారి ఓబులేసు తెలిపారు. మూడవ శనివారం సందర్భంగా చాగలమర్రి రెండవ సచివాలయం వద్ద సర్పంచ్ తులశమ్మ ఆధ్వర్యంలో స్వచ్ఛదివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. చలివేంద్రం ప్రారంభించి మొక్కలు నాటారు. ఆయా శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. స్వచ్ఛదివస్ కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచాలని ప్రత్యేక అధికారి ఓబులేసు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవి కుమార్, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో ఆవరణలో శ్రమదానం

ఆళ్లగడ్డ, మే 17(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ ఆర్టీసీ డిపో ఆవరణంలో శనివారం డిపో అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది కలిసి శ్రమదానం నిర్వహించారు. బస్టాండ్ ఆవరణలో చెత్తాచెదారాన్ని తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ కార్యదర్శి రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

దొర్నిపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం స్వచ్ఛంధ్ర, స్వచ్ఛదివస్‌పై స్పెషల్ ఆఫీసర్ గోవిందనాయక్, ఎంపీడీవో సావిత్రి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు ఉన్నారు.

ఉల్లంఘనులు

- రహదారుల్లోనే రాళ్ల కుప్పలు
- కుచించుకుపోతున్న రోడ్లు
- ప్రమాదాల బారినపడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



రాళ్లవ్యర్థాలతో కుచించుకుపోతున్న బెలుం-కోవెలకుంట్ల ఆర్అండ్‌బీ రహదారి



ఎన్‌హెచ్-544డి పక్కనే పడేసిన నాపరాళ్ల వేస్టేజీ

కొలిమిగుండ్ల, మే 17 (ఆంధ్రజ్యోతి) : నాపరాతి గనుల యజమానులు నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. మైనింగ్, రవాణా జారీ చేసిన నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. నాపరాతి గనులు, పాలిషింగ్ యూనిట్లలో లభించే వేస్టేజీని ప్రధాన రహదారుల పక్కనే పడేస్తున్నారు. దీంతో ఆ కుప్పలు కాస్త కొండలను తలపిస్తున్నాయి. బనగానపల్లె నియోజకవర్గం లోని కొలిమిగుండ్ల, అవుకు, బనగానపల్లె మండలాల్లో నాపరాత గనులు విస్తారంగా ఉన్నాయి.

ఎన్‌హెచ్-544డి పక్కనే రాళ్ల కుప్పలు

వేలాది వాహనాలు సంచరించే అనంతపూర్-అమరావతి జాతీయ రహదారి ఎన్‌హెచ్- 544డి వెంబడి గనులు, పరిశ్రమల్లోని వేస్టేజీని పడేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు నిత్యం ఈ రహదారి గుండా ప్రయాణం చేస్తున్నా పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. కొలిమిగుండ్ల మండలంలోని అనంతపురం జిల్లా సరిహద్దు ప్రాంతమైన బందార్లపల్లె చెక్ పోస్టు నుంచి, అంకిరెడ్డిపల్లె, కనకాద్రిపల్లె, బెలుం, అవుకు మండలంలోని రామాపురం, అవుకు, బనగానపల్లె వరకు హైవే వెంబడి గనుల యజమానులు వేస్టేజీని పడేస్తున్నారు. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయంగా మారుతోంది. ఈ రాళ్ల కుప్పలతో గతంలో పలుమార్లు రోడ్డు ప్రమాదాలు జరిగి, పలువురు మృత్యువాత పడిన ఘటనలు అనేకం ఉన్నాయి.

బోర్డులు ఏర్పాటు చేసినా...

ఆర్అండ్‌బీ అధికారులు రహదారుల పక్కన 45మీటర్ల వరకు గనులు చేయరాదని, వేస్టేజీ నాపరాళ్లు వేయరాదని బోర్డులు ఏర్పాటుచేసినా, అక్రమార్కులు ఏమాత్రం లెక్కచేయడంలేదు. బోర్డుల పక్కనే ఇష్టానుసారంగా నాపరాళ్ల వేస్టేజీని గుట్టలుగా వేస్తుండటంతో రహదారులు కుచించుక పోతున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఉన్నతాధికారులు చర్యలు చేపట్టి రహదారులను కాపాడాలని కోరుతున్నారు.

ఆర్అండ్‌బీ, గ్రామీణ రోడ్ల పరిస్థితి..

జాతీయ రహదారి పరిస్థితే ఇక్కడ ఇలా ఉంటే.. ఇక ఆర్అండ్‌బీ, గ్రామీణ రోడ్ల ఉనికిని కోల్పోయే ప్రమాదం ఏర్పడుతోంది. మండలంలోని బెలుంశింగవరం, చింతాయపల్లె, తిమ్మనాయినిపేట, బందార్లపల్లె గ్రామాల ఆర్అండ్‌బీ రహదారులను సైతం రాళ్ల కుప్పలతో కప్పి వేస్తున్నారు. మీర్జాపురం నుంచి బెలుంశింగవరం, బెలుం గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులు గనుల యజమానుల నిర్లక్ష్యం, అవినీతి కారణంగా కనిపించకుండా పోయిన పరిస్థితి నెలకొంది. దీంతో బెలుం, బెలుంశింగవరం గ్రామాలకు చెందిన ప్రజలు మీర్జాపురం చేరుకోవాలంటే కొలిమిగుండ్ల తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి.

‘స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర’యే ప్రభుత్వ లక్ష్యం

- ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలి
- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- రాష్ట్ర ఆర్అండ్‌బీ శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి
- వెటర్నరీ ఆస్పత్రిలో మొక్కలు నాటిన మంత్రి



బనగానపల్లెలో ప్రజలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, మే 17 (ఆంధ్రజ్యోతి): ‘స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర’యే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఆర్అండ్‌బీ శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం స్పెషలాఫీసర్ సుబ్బారెడ్డి, ఎంపీడీవో రమణ, ఈవో సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలతో కలసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వెటర్నరీ ఆసుపత్రి ఆవరణలో మొక్కలను నాటారు. జీఎం టాకీస్‌వద్ద ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు.

మహిళల ఆర్థిక స్వావలంబన..

కొలిమిగుండ్ల: మహిళల ఆర్థిక స్వావలంబన కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. గ్రామ సచివాలయంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత కుట్టుమిషన్ పథకాన్ని మంత్రి ప్రారంభించారు. మొత్తం 300మంది మహిళలు ఉచిత కుట్టు శిక్షణ కేంద్రంలో పాల్గొనడం అభినందనీయమని అన్నారు. 70 కుట్టు మిషన్లు అందుబాటులో ఉంచి, మహిళలకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్‌లో చలివేంద్రాన్ని మంత్రి బీసీ ప్రారంభించారు. ఎంపీడీవో ప్రసాదరెడ్డి, ఏవో భూమా జ్యోతి, ఎంఈవో అబ్దుల్‌కలాం, ఏఈ కరీముల్లా, సీఐ రమేష్‌బాబు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి

స్థానిక స్టేట్‌బ్యాంకు వద్ద ప్రధాన రహదారిపై నీరు నిలవకుండా డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి హైవే అధికారులను ఆదేశించారు. వర్షం పడిన సమయంలో వరద నీరు రహదారిపై నిలిచిపోయి, వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఈ సమస్య మంత్రి దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. సమస్యకు త్వరితగతిన శాశ్వత పరిష్కారాన్ని చూపాలని మంత్రి బీసీ అధికారులకు ఆదేశించారు. టీడీపీ మండల అధ్యక్షులు మూలే రామేశ్వరరెడ్డి, వీఆర్ లక్ష్మీరెడ్డి, పులిప్రకాశ్‌రెడ్డి, నంద్యాల రామేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి: జేసీ



శిరివెళ్లలో చలివేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ విష్ణు చరణ్

శిరివెళ్ల, మే 17(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని గ్రామ పంచాయతీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ తెలిపారు. శనివారం శిరివెళ్లలో నిర్వహించిన ‘స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర’ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని సూచించారు. పంచాయతీ నిధులను సక్రమంగా వినియోగించుకుని అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. అనంతరం గ్రామ సచివాలయం-1 ఆవరణలో ఏర్పాటు చేసిన మజ్జిగ, తాగునీటి చలివేంద్రాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పుష్పకుమారి, ఎంపీడీవో శివ మల్లేశ్వరప్ప, పంచాయతీ కార్యదర్శి అశ్విన్ కుమార్, ఈవోపీఆర్డీ శ్రీనివాస శర్మ, హౌసింగ్ ఏఈ అహ్మద్ బాషా, ఐకేపీ ఏపీఎం రాజశేఖరరెడ్డి, సర్పంచ్ లక్కాకుల సాలమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

పకడ్బందీగా భూ రీసర్వే



మాట్లాడుతున్న ఆర్డీవో విశ్వనాథ్

చాగలమర్రి, మే 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూరీసర్వే పనులు పకడ్బందీగా చేయాలని నంద్యాల ఆర్డీవో చల్లా విశ్వనాథ్ సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో భూరీసర్వే ఆన్‌లైన్ ప్రక్రియను ఆర్డీవో పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నంద్యాల డివిజన్ పరిధిలో 14 మండలాల్లో మొదటి విడత పైలెట్ ప్రాజెక్టుగా 13 గ్రామాల్లో భూరీసర్వే పూర్తయిందన్నారు. ప్రస్తుతం 17 గ్రామాల్లో రీసర్వే జరుగుతుందన్నారు. నేలంపాడు గ్రామంలో రీసర్వే పూర్తయిందని, బ్రాహ్మణపల్లె, చింతలచెరువు గ్రామాల్లో 7 టీమ్‌లతో భూ రీసర్వే చేస్తున్నామని అన్నారు. 44వ జాతీయ రహదారి చాగలమర్రి నుంచి వేంపల్లెకు రహదారి కోసం మల్లేవేములలో 33 ఎకరాలు, చాగలమర్రిలో 6 ఎకరాలు భూసేకరణ చేస్తామని అన్నారు. ఎకరాకు రూ.9.33 లక్షలు ప్రకారం 16 ఎకరాలకు నష్టపరిహారం అందజేశామని అన్నారు. చాగలమర్రిలో ఎకరాకు నష్టపరిహారంగా రూ.62.58 లక్షలు చొప్పున 16 ఎకరాలకు బిల్లుల కోసం ప్రతిపాదనలు పంపించామని అన్నారు. దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవికుమార్, మండల సర్వేయర్ మద్దిలేటి, ఆర్ఐ అబ్దుల్‌సత్తార్, వీఆర్వోలు పాల్గొన్నారు.

సైన్యానికి దేశప్రజల అండ

- మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ
- డోన్‌లో తిరంగా ర్యాలీ



తిరంగా ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే, నాయకులు

డోన్ రూరల్ , మే 17(ఆంధ్రజ్యోతి): భారతదేశ సైన్యానికి ప్రజల అండ ఎల్లప్పుడూ ఉంటుందని డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం పట్టణంలోని టీడీపీ కార్యాలయం నుంచి పాతబస్టాండ్ వరకు తిరంగా ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి ఆమె మాట్లాడుతూ ఇటీవల పహల్గాంలో ఉగ్రవాదులు యాత్రీకులను చంపడం దారుణమన్నారు. ఈ విషాద ఘటన మనస్సును కలచివేసిందన్నారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత సైనికులు తమ ప్రాణాలను లెక్కచేయకుండా ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేసి తన సత్తా ప్రపంచానికి చాటిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు లక్కసాగరం లక్ష్మీరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొణతల రామకృష్ణ, ఓబుళాపురం శేషిరెడ్డి, నాయకులు ఓంప్రకాశ్, నందు వెంకటరమణ, హేమసుందర్‌రెడ్డి, వడ్డె మహరాజ్, ఆర్డీవో నరసింహులు, తహసీల్దార్ నాగమణి, సీఐ ఇంతియాజ్‌బాషా, ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన మాజీ ఎమ్మెల్యే

ఉమ్మడి కర్నూలు జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ఓర్వకల్లు ఎయిర్‌పోర్టులో మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ కలిశారు. డోన్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు, ప్రయోజనాల గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ వివరించి చర్చించారు.

రెడ్‌క్రాస్ నూతన కమిటీ ఎన్నిక

డోన్ రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. సొసైటీ ఛైర్మన్‌గా కొచ్చెర్వు వెంకటేశ్వర్లు, గౌరవ సలహాదారులుగా బాలసుబ్బయ్య, కృష్ణమూర్తి, కార్యదర్శిగా ఖాజాహుస్సేన్‌బాషా, కోశాధికారిగా మల్లికార్జునలను ఎన్నుకున్నారు. కార్యక్రమానికి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్మన్ దస్తగిరి, కార్యవర్గసభ్యులు నాగసురేంద్ర హాజరయ్యారు.

కౌలు రైతులకు అవగాహన

చాగలమర్రి, మే 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో కౌలు రైతులకు కార్డులు దరఖాస్తులు చేసుకునేందుకు అవగాహన కల్పిస్తున్నామని ఏవో రంగనేతాజీ తెలిపారు. శనివారం చాగలమర్రి రైతుసేవా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ భూహక్కు యాజమాన్య పత్రాన్ని కౌలు రైతులు పొందితే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో వీహెచ్ఏలు, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ



ఆలయం ఎదుట ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న భక్తులు

బేతంచెర్ల, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముద్దవరం గ్రామంలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో రంగస్వామి నూతన విగ్రహం, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వేదపండితుల మంత్రోచ్చరణాల మధ్య శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఆడపడుచులకు వడిబియ్యాలు పోశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పూజలు

డోన్ రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటనాయునిపల్లె గ్రామంలో శ్రీరాములోరి విగ్రహ ప్రతిష్ఠ పూజలు కొనసాగుతున్నాయి. శనివారం ఆలయంలో ఉత్సవమూర్తులకు ప్రత్యేక అభిషేకాలు, శాంతిహోమాలు నిర్వహించారు. శతావధాని దత్తాత్రేయ శర్మ శ్రీరాముడి చరిత్ర, రామాయణ విషయాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వెంకట నాయునిపల్లె శ్రీనివాసులుయాదవ్, సర్పంచ్ సీలం చంద్రశేఖర్ నాయుడు, భక్తులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలపై జీవీవో రూ.7147కోట్లు

- జిల్లా ఉద్యాన శాఖాధికారి నాగరాజు

రుద్రవరం, మే 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉద్యానపంటలపై రాష్ట్ర ప్రభుత్వానికి జీవీవో (గ్రాస్ వాల్యూ అవుట్‌పుట్) రూ.7147 కోట్లు వస్తుందని జిల్లా ఉద్యాన శాఖాధికారి నాగరాజు అన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతేడాది రూ.6,600 కోట్లు జీవీవో రాగా 2025-26కు రూ.7,147 కోట్లు జీవీవో వస్తుందన్నారు. జిల్లాలో 48వేల ఎకరాల్లో ఉద్యానపంటలు సాగవుతున్నాయన్నారు. ఐదెకరాల లోపు భూములు ఉన్న రైతులకు పండ్లతోటల పెంపకంపై వంద శాతం రాయితీ, ఐదు ఎకరాల పైబడి ఉన్న రైతులకు 40శాతం సబ్సిడీ అందిస్తామన్నారు. ఆసక్తి ఉన్న రైతులు ఆయా మండలాల్లో ఎంపీడీవోలు, ఏపీవోలను సంప్రదించాలని కోరారు కార్యక్రమంలో ఎంపీడీవో భాగ్యలక్ష్మి, ఏపీవో గౌరీబాయి తదితరులు పాల్గొన్నారు.

వినతి ఇచ్చే స్వేచ్ఛ కూడా లేదా?

- కాంగ్రెస్ నియోజకవర్గ సమన్వయకర్త గార్లపాటి మద్దిలేటి

డోన్ రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి): ప్రతిపక్ష నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు వినతి పత్రం అందించే స్వేచ్ఛ కూడా లేదా అని కాంగ్రెస్ డోన్ నియోజకవర్గ సమన్వయకర్త గార్లపాటి మద్దిలేటి ప్రశ్నించారు. శనివారం డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహయాదవ్‌ను ముందస్తు అరెస్టు చేసి ఉలిందకొండ పోలీస్‌స్టేషన్‌లో ఉంచారు. దాంతో కాంగ్రెస్ డోన్ నాయకులు స్టేషన్‌కు వెళ్లి నరసింహ యాదవ్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్నూలు జిల్లా పర్యటనకు వచ్చిన సీఎంకు సమస్యలపై వినతిపత్రం అందించేందుకు సిద్ధమైన డీసీసీ అధ్యక్షుడు నరసింహయాదవ్‌ను పోలీసులు ముందస్తు అరెస్టు చేయడం సరికాదన్నారు. పోలీసుల తీరుతో ప్రజాస్వామ్యంలో ప్రజా స్వేచ్ఛకు భంగం కలుగుతుంద ని ఆరోపించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

కోవెలకుంట్ల, మే 17 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీ శివయ్య అన్నారు. శనివారం పట్టణంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023సంవత్సరం జూలై 1నుంచి అమలు కావాల్సిన పీఆర్సీ రెండేళ్ల గడిచినా ప్రభుత్వం కనీసం కమిటీ వేయకపోవడం శోచనీయమన్నారు. 11వ పీఆర్సీ బకాయిలు విడుదల చేయాలని, పెండింగులో ఉన్న మూడు డీఏ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి గ్రామంలో 1నుంచి 5 వరకు, 6నుంచి 10వరకు మాత్రమే పాఠశాలలు ఉండాలన్నారు. సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు దస్తగిరిబాషా,హుసేన్‌వలి, విజయభాస్కర్ పాల్గొన్నారు.

ప్రతి రోజూ వ్యాయామం చేయాలి

కోవెలకుంట్ల, మే 17 (ఆంధ్రజ్యోతి): ప్రతి రోజూ శారీరక వ్యాయామం చేస్తే బీపీ సమస్య తగ్గుతుందని మాయలూరు పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ కెనడీ అన్నారు. శనివారం పట్టణంలోని శ్రీవాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధిక రక్తపోటుపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా మాయలూరు పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ కెనడీ పాల్గొని మాట్లాడారు. ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు మంచి పోషకాహారం తీసుకోవాలన్నారు. హైబీపీని నివారించాలంటే ఆహారంలో ఉప్పును చాలా వరకు తగ్గించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వేణుగోపాల్, అధ్యాప కులు రామసుబ్బారెడ్డి, ఫార్మసిస్టు మునిస్వామి, అధ్యాపకులు నరేంద్రనాథ్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, పుల్లయ్య పాల్గొన్నారు.

హోరాహోరీగా ఒంటెద్దు బండి బండలాగుడు పోటీలు

చాగలమర్రి, మే 17 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని కట్టమీది దస్తగిరిస్వామి ఉరుసు సందర్భంగా ఏర్పాటు చేసిన ఒంటెద్దుబండి రాతిదూలం పోటీలు హోరాహోరీగా సాగాయి. పోటీలను టీడీపీ రాష్ట్ర మైనార్టీసెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా, టీడీపీ నాయకులు కొలిమి షరీఫ్, మౌలాలి ప్రారంభించారు. పోటీల్లో వివిధ ప్రాంతాలకు చెందిన 22 వృషబాలు పాల్గొన్నాయి. గెలుపొందిన వృషభ యజమానులకు నగదు, బహుమతులను దాతలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అనిఫ్, జల్సా గౌస్, ఖలీల్, ఉసేన్‌వలి, గఫార్, అష్రఫ్, ఉసేన్‌వలి, రైతులు పాల్గొన్నారు.

20న బావిపల్లిలో కబడ్డీ పోటీలు

ప్యాపిలి, మే 17 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ జయంతిని పురస్కరించుకొని మండలంలోని బావిపల్లి గ్రామంలో ఈనెల 20న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం తెలిపారు. గెలుపొందిన జట్లకు వరుసగా రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేలు అందజేయనున్నట్లు తెలిపారు. 22న రాతిదూలం పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల్లో గెలుపొందే వృషభాలకు వరుసగా రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.8వేలు, రూ.6వేలు, రూ.4వేలు, రూ.3వేలు, రూ.2వేలు అందజేయనున్నట్లు తెలిపారు. వివరాలకు 6305427212 నెంబరును సంప్రదించాలని కోరారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం



మాలిక్ మృతదేహంపై పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే

ఆళ్లగడ్డ మే 17(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన హోంగార్డు మాలిక్ కుటుంబానికి అండగా ఉంటామని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ భరోసానిచ్చారు. పట్టణంలోని సద్దాం కాలనీకి చెందిన టీడీపీ నాయకురాలు రమీజాబి తమ్ముడు హోంగార్డు మాలిక్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయ పడ్డాడు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కాలనీకి వెళ్లి మాలిక్ మృతదేహంపై పూలమాల వేసి నివాళి అర్పించారు. మృతుడి ముగ్గురు పిల్లల చదువు బాధ్యతను తాను చూసుకుంటానని ఆమె హామీ ఇచ్చారు.